www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శనివారం 18 జనవరి 2025
సంపుటి :06 సంచిక : 230 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## స్థలం లేని అర్హులైన వారికి స్థలం కొని ఇల్లు కట్టి ఇవ్వాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 17:**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో అర్హులై స్థలం లేని వారికి గుర్తించి స్థలం ఇచ్చి ఇల్లు కట్టి ఇవ్వాల్సిందనని 2 లో..

## సింగపూర్ ఐటిఈ ని సందర్శించిన సిఎం రేవంత్ రెడ్డి బృందం

- సింగపూర్ ఐటిఈ అధికారులతో రాష్ట్ర మంత్రి ఐటి అధికారుల బృందం భేటీ





2 లో..

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

- పారదర్శకంగా గ్రామసభల్లో ఇందిరమ్మ లబ్దిదారుల జాబితాలు
- త్వరలో సర్వేయర్ల, గ్రామాధికారుల నియామకం
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జనవరి 17:**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇండ్ల స్థలం ఉన్నవారికి , రెండవ విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకంపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారంనాడు చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వి.పి. గౌతమ్, జిహెచ్ ఎం సీ కమీషనర్ ఇలంబర్తి, సిఎంఆర్వో డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ విభాగాన్ని సమకూర్చుకోవడం, ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారి నియామకం, సర్వేయర్ల నియామకంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ 2 లో..

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్ పాల్

( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు,హైదరాబాద్ బ్యూరో, జనవరి 17:**



తెలంగాణ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ నియమితులయ్యారు. ఈ మేరకు భారత రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు తెలంగాణ 2 లో..

## ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పై సచివాలయం లో సమీక్షా సమావేశం



ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశం- పాల్గొన్న అధికారులు

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 17:**
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన తెలంగాణ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పై శుక్ర వారం నాడు ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు.ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశాలు జారీచేశారు, ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి శాఖ కూడా ప్రతి నెలా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ఖర్చు వివరాలను ప్రభుత్వానికి అందించాలన్నారు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సకాలంలో ఖర్చు చేయకపోతే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం హెచ్చరించారు.

**నిధుల పూర్తి వినియోగం:**
అన్ని నిధులు పూర్తిగా వినియోగించుకోవాలని భట్టి విక్రమార్క తెలిపారు. 2 లో..

## దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు చర్యలు

- జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టి
- భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025' ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ,జనవరి17( వెలుతురు):**
దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం 2 లో..

# ఆరు గ్యారెంటీలని.. అర గ్యారెంటీ అమలు

- సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కడికక్కడ నిలదీయండి
- బాకీలు అడిగినట్లుగా కాంగ్రెస్ నేతలను అడగండి
- తులం బంగారం సహా హామీలపై ప్రశ్నించండి
- చేవెళ్లలో ఉప ఎన్నిక రావడం ఖాయం
- హామీలను అమలు చేసేదాకా నిలదీస్తూనే ఉంటా
- షాబాద్ బిఆర్ఎస్ రైతు ధర్నా సభలో కెటిఆర్



**రంగారెడ్డి,జనవరి 17( వెలుతురు):**
కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన ప్రసంగించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న 1.67 కోట్ల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున రూ.30వేలు సీఎం రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా. గతంలో రైతుబంధుకు అడ్డుగా పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ మహిళలు, రైతులు నిలదీయాలని ఈ సందర్భంగా కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రుణమాఫీ వంద శాతం పూర్తయిందని నిరూపిస్తే.. నేను, మా ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తాం' అంటూ సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. కేవలం ఫ్రీ బస్సుతో సరిపెట్టారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను రైతులు నిలదీయాలన్నారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి 2 లో..

## ప్రజల దృష్టిని మళ్లించేలా రాజకీయ ఎత్తుగడలు

- కేసులపై ప్రజలను తప్పదోవ పట్టిస్తున్న కెటిఆర్
- రైతుభరోసాపైనా రాజకీయ ధర్నాలు
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ జీవన్ రెడ్డి



**హైదరాబాద్,జనవరి17( వెలుతురు):**
ప్రజల దృష్టిని మళ్లించడమే లక్ష్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్ పోరాటం చేయడంతోనే కాంగ్రెస్ రైతుభరోసా ఇచ్చిందని చెప్పడానికి ప్రయత్నాలు చేస్తున్నారని చురకలంటించారు. అందుకే బిఆర్ఎస్ నేతలు రైతు దీక్ష చేపట్టారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పాటుపడు తోందని, ఈ 2 లో..

## నిషేధిత జాబితా నుంచి 7లక్షల ఎకరాల భూముల తొలగింపు

- అధ్యయనానికి కేబినేట్ సబ్ కమిటీ ఏర్పాటు
- ధాన్యం కొనుగోలు కోసం 700 కోట్ల రూపాయలకు గ్యారెంటీ
- 62 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటు
- ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ టారిఫ్ తగ్గింపు
- పోలవరం డయాఫ్రామ్ వాల్ నిర్మాణానికి ఆమోదం
- అమరావతి పనులకు వేగంగా నిర్ణయాలు
- విశాఖ స్టీల్‌కు ఆర్థిక ప్యాకేజీతో కేంద్రానికి కృతజ్ఞతలు
- ఎపి కేబినేట్‌లో పలు కీలక నిర్ణయాలు

9 లో..



**అమరావతి,జనవరి 17( వెలుతురు):**
నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు ఎపి కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. వైకాపా హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనిపై అధ్యయనం చేసి ఆయా

## విశాఖ ఉక్కు హామీని నిలబెట్టుకున్న కేంద్రం

- ప్లాంట్ పునరుద్ధరణకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ
- మీడియా సమావేశంలో వెల్లడించిన కేంద్రమంత్రులు

7 లో..

**న్యూఢిల్లీ,జనవరి 17( వెలుతురు):**
విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు మీడియాతో




## ఉద్యోగుల పనితీరుపై నిఘా ఉండాల్సిందే

- అత్యుత్తమ పనితీరుకు ఇది దోహద పడుతుంది
- డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అభిప్రాయం



2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

ఇండ్లకు అర్హులైన లబ్ధిదారులకు సంబంధించిన నివాస స్థలం ఉన్నవారి జాబితా, నివాస స్థలం లేని వారి జాబితా రెండు జాబితాలను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం , పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజనీర్లు అవసరమని ఈ సందర్భంగా అధికారులు మంత్రిగారి దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రభుత్వ విభాగాలలో ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చు వంటి అంశాలను పరిశీలించాలని ఈ సందర్భంగా మంత్రిగారు సిఎస్ గారికి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. విలేజీ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని ఇందుకోసం విఆర్వో, విఆర్ఎ నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్షకు సంబంధించిన విధివిధానాలను తక్షణమే రూపొందించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని అదనంగా మరో వెయ్యి మంది సర్వేయర్లు అవసరమున్న నేపథ్యంలో సర్వేయర్ల ఎంపికకు కావలసిన ప్రణాళిక తయారు చేయాలని ఎంపిక విధానం పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు.

## సింగపూర్ ఐటిఈ ని సందర్శించిన సిఎం రేవంత్ రెడ్డి బృందం




( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 17:**

తెలంగాణ రైజింగ్ ప్రధాన ఎజెండాగా సింగపూర్ పర్యటనలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి , పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నతాధికారులతో కలిసి సింగపూర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ITE Singapore)ను శుక్ర వారం సందర్శించారు. సింగపూర్ ఐటీఈలో సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి సహా 20 కి పైగా విభిన్న డొమైన్‌ల పనితీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం పరిశీలించింది. ఆయా రంగాలలో పనిచేస్తున్న నిపుణులు, సిబ్బందితో ముఖ్యమంత్రి సంభాషించారు.తెలంగాణలో స్కిల్స్ డెవలప్‌మెంట్ పట్ల అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి ముందుకొచ్చిన సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, సెంట్రల్ కాలేజీతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మధ్య కీలకమైన ఒప్పందం కుదిరింది. క్యాంపస్ పరిశీలన అనంతరం జరిగిన చర్చలు, సంప్రదింపుల మేరకు తెలంగాణలో స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో సింగపూర్ ఐటీఈ అధికారులు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వీఎల్ వీఎస్ఎస్ సుబ్బారావు ఒప్పందంపై సంతకాలు చేశారు.ఈ ఒప్పంద కార్యక్రమంలో ఐటీఈ సింగపూర్ అకడమిక్, అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్వీందర్ సింగ్, ఐటీఈ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానం మేరకు సింగపూర్ ఐటీఈ ప్రతినిధి బృందం త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించనుంది.

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్ పాల్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అలోకే ఆరాధే బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.జస్టిస్ సుజోయ్ పాల్ జూన్ 21, 1964న జన్మించారు. ఆయన బి .కామ్ , ఎంఎ మరియు ఎల్ ఎల్ బి విద్యను పూర్తి చేశాడు. అతను 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకొని అనేక బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్ మరియు ఇతర బోర్డులకు సేవలందించాడు. మే 27, 2011న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సుజోయ్ పాల్, 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. తర్వాత, సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు మేరకు, ఆయనను బదిలీ చేశారు. మార్చి 21, 2024న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గా నియామకం అయ్యారు ఇటీవల ఆయన ప్రధాన న్యాయమూర్తిగా నియమితులై తన న్యాయ సేవా ప్రయాణంలో మరో మైలురాయిని చేరుకున్నారు.

## స్థలం లేని అర్హులైన వారికి స్థలం కొని ఇల్లు కట్టి ఇవ్వాలి




ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. శుక్రవారం నిర్మల్ జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి కార్యక్రమం ప్రణాళిక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క, నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఉమ్మడి అదిలాబాద్ ఎమ్మెల్యే జిల్లాకు సంబంధించిన జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ఆదిలాబాద్ లోని నెలకొన్న సమస్యలు తోపాటు రైతు భరోసా ఇందిరమ్మ ఇల్లు ఆత్మీయ భరోసా రేషన్ కార్డు తదితర పథకాల అమలుకై పలు సూచనలు చేశారు వాస్తవానికి లబ్ధిదారునికి ఇల్లు అవసరం ఉంది. ఇంటి స్థలం లేదు.. ఒక్కరి కూడా ఇంటి స్థలాలు ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల స్థలాల పంపిణీ పథకం అభాసు పాలు అయ్యే అవకాశం ఉందన్నారు. పేదవాడు ఇండ్ల స్థలాలు కొనుక్కోనే పరిస్థితి లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూపాయలు ఐదు నుంచి ఆరు లక్షల పెడితేనే కానీ ప్లాట్లు రావడం లేదన్నారు. వారు ప్లాట్లు కొనలే కొనలేరు.. మనం ఇల్లు ఇవ్వలేము .. వెనుకబడిన అదిలాబాద్ జిల్లాకు మంత్రి ద్వారా ముఖ్యమంత్రి కి ప్రత్యామ్నాయంగా చేసి అర్హులైన వారికి స్థలంతో పాటు ఇండ్లు మంజూరయ్యేలా చూడాలని ఈ సభాముఖంగా కోరడం జరుగుతుందన్నారు...

## ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పై సచివాలయం లో సమీక్షా సమావేశం

ఆదాయం పెంచాలి:
ఎస్సీ, ఎస్టీల ఆదాయం పెరగడానికి అనుగుణంగా పథకాలు రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు

సెస్ నివేదిక:
సెస్ నివేదికలను పరిశీలించి, వాటి ఆధారంగా మెరుగుదలలు చేయాలన్నారు,

అటవీ భూముల అభివృద్ధి
అటవీ భూములను సోలార్ పవర్, వెదురు, అవకాడో సాగు వంటి వాటితో అభివృద్ధి చేయాలని భట్టి విక్రమార్క చెప్పారు

మూసి పునర్జీవనం:
మూసి పునర్జీవనం కారణంగా నిర్వాసితులైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు స్వయం సహాయక సంఘాల ద్వారా సహాయం చేయాలి. వడ్డీ లేని రుణాలను అందించాలని నిర్ణయించినట్లుగా భట్టి చెప్పారు

పట్టణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి
పట్టణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి కల్పించే పథకాలను విస్తరించాలన్నారు ,ఎస్సీ, ఎస్టీ శాఖలు ఇతర



శాఖలతో కలిసి పని చేసి, నిధులను సమర్థవంతంగా వినియోగించాలి.అటవీ భూముల అభివృద్ధి ద్వారా ఆదివాసి, గిరిజన రైతులఆదాయంపెరుగుతుంది.పట్టణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు రవాణా వాహనాలు, క్లీనింగ్ యంత్రాలు అందించాలని సూచించారు.ఆర్థిక సంవత్సరంలో సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేసేందుకు వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలతో ఎస్సీ, ఎస్టీ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలు సమావేశమై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, వికాస్ రాజ్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, ఎస్సీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఎస్టి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలని.. అర గ్యారెంటీ అమలు



మహిళకు రేవంత్ రూ.30 వేలు బాకీ పడ్డారని.. రూ.30 వేలు ఇస్తేనే ఓటేస్తామని మహిళలు నిలదీయాలని మాజీ మంత్రి అన్నారు. ఎన్నికలప్పుడు రూ.7600 కోట్లు రైతుబంధు వేసేందుకు తాము సిద్ధమైతే ఈసీకి లేఖ రాసి రైతు బంధును వేయనీయకుండా అడ్డుకున్నారన్నారు. యాసంగి పంట సమయంలో రైతుల కోసం రూ.7600 కోట్లు పెడితే.. రేవంత్ ప్రభుత్వం వచ్చాక నాట్లు వేసే సమయంలో కాకుండా.. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రైతుల ఖాతాలో వేశారని విమర్శించారు. ఒక్కసారి మాత్రమే కేసీఆర్ ఇచ్చిన డబ్బులను రైతు భరోసా కింద వేశారని.. ఆ తరువాత రైతు భరోసా ముచ్చటే లేదన్నారు. ఖచ్చితంగా జనవరి 26న రైతులకు ఇస్తానన్న రైతు భరోసాను ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. అది కూడా రూ.12 వేలు కాదు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలను రైతుల ఖాతాలో జమ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వానాకాలం పంటకు ఎగ్గొట్టిన రైతు బంధును కూడా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఓటేయమని అడిగితే.. ముందు బాకీ తీర్చాకే ఓటు వేస్తామని గట్టిగా చెప్పాలని రైతులకు చెప్పారు. రైతులకు ఎకరానికి రూ.17500 బాకీ ఉంటే.. మహిళలకు సంవత్సరానికి రూ.30 వేల మేర రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి మోసగాడు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. 37 రోజులు కాదు దమ్ముంటే 370 రోజులు జైల్లో పెట్టుకో.. భయపడేటోడు ఎవడూ లేడు అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకో. నిలబెట్టుకోకపోతే వెంటాడుతాం.. అడుగూతనే ఉంటాం. పేదల తరపున కొట్లాడుతూనే ఉంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు వస్తారు.. చేయి గుర్తుకు ఓటేయండి అని అడుగుతారు. మీ సీఎం రైతుభరోసా కింద ఎకరానికి 17500 చొప్పున బాకీ ఉన్నాడు.. ఆ డబ్బులు చెల్లిస్తే ఓట్లు వేస్తామని చెప్పండి. బాకీ ఉన్నోన్ని అడిగినట్టు గల్లా పట్టుకుని అడగాలి.. అభయ హస్తం భస్మాసుర హస్తం అయిపోందని నిలదీయాలని ఆడబిడ్డలకు, రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు చిలుకకు చెప్పినట్టు చెప్పిండు కేసీఆర్. కాంగ్రెసోళ్లను నమ్మకండి అని చెప్పిండు. నెలకు 2500 పడ్డాయా..? 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు అయ్యాయా.? సర్పంచ్ ఎన్నికలప్పుడు వేస్తడు.. మళ్లీ నాలుగేండ్ల వరకు కనిపించడు. కాబట్టి రైతుబీమా, రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎక్కడ అని నిలదీయండని రైతులకు, ఆడబిడ్డలకు కేటీఆర్ సూచించారు. ఈ ఏడాది కాలంలో నాలుగైదు లక్షల లగ్గాలు అయ్యాయి. రేవంత్ రెడ్డికి తులం బంగారం దొరకతలేదా ..? బంగారం షాపుడో నిన్ను నమ్మడం లేదా..? పెళ్ళైన ఆడబిడ్డలకు 80 వేల చొప్పున బాకీ ఉన్నాడు. సిలిండర్ ఫ్రీగా వస్తలేదు. కరెంట్ 200 యూనిట్ల ఫ్రీగా ఇవ్వడం లేదు. పచ్చి మోసగాడు.. పచ్చి అబద్దాల కోరు సీఎం రేవంత్.. 420 కేసు పెట్టాలంటే రేవంత్ రెడ్డి మీద చీటింగ్ కేసు పెట్టాలి. మనం కేసులు పెట్టినా.. పోలీసులు దరఖాస్తు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డి భయం పట్టుకుంది వాళ్లకు. అందుకే ఓట్లప్పుడే రేవంత్ రెడ్డికి చురుకు పెట్టాలని కేటీఆర్ చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో త్వరలోనే ఉప ఎన్నిక రాబోతుందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను రైతులు, ఆడబిడ్డలు ఎండగట్టాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌కు ఓటేయడంతో ఇక్కడున్న ఎమ్మెల్యే గెలిచిండు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సంకలో జొచ్చిండు. అభివృద్ధి కోసం పోయాను అని అంటుండు. ఈ ఏడాదిలో ఏం అభివృద్ధి జరిగింది..? రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా అమలైందా..? ఆడబిడ్డలకు తులం బంగారం, స్కూటీ ఇచ్చావా..? ఏం అభివృద్ధి అయింది.. ఉన్నది పీకింది. ఎన్నికలు వచ్చినప్పుడు చేవేళ్లలోనే కాదు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల 10 నియోజకవర్గాల్లో బుద్ధి చెబుదాం. రైతు భరోసా వేయనందుకు, వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టినందుకు, రుణమాఫీ మోసం చేసిందుకు, ఆడబిడ్డలకు రూ. 2500 ఇవ్వనందుకు, మా భూమి మాకే ఉండాలన్న పాపానికి 40 మంది రైతులను జైల్లో పెట్టి హంసించినందుకు.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదాం. చివరకు వృద్ధులను కూడా మోసం చేసిండు.

ఆసరా పెన్షన్లు 4 వేలు ఇవ్వడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డి నోటికి హద్దు లేదు. మందికి పుట్టిన బిడ్డలను మా బిడ్డలు అని చెప్పుకుంటుండు. కేసీఆర్ ఇచ్చిన 44 వేల ఉద్యోగాలను నేను ఇచ్చిన అని చెప్పుకుంటూ మోసం చేస్తున్నాడు. ఇవాళ షాబాద్‌లో జరిగిన ధర్నా మొట్టమొదటి.. మిగతా చోట్ల కూడా ధర్నా చేస్తాం. 70 లక్షల మంది రైతుల పక్షాన, 22 లక్షల మంది కౌలు రైతుల పక్షాన, భూమి లేని నిరుపేదల పక్షాన అడుగుతున్నాం.. ఇచ్చిన మాట నిలబెట్టుకో.. అందరికీ రైతుభరోసా జమ చేయ్.. లేదంటే రేపు పంచాయతీ ఎన్నికల్లో నీ వీపు చింతపండు చేస్తారు మా ఆడబిడ్డులు, రైతులు. ఇది ఆరంభం మాత్రమే.. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతూనే ఉంటాం.. ఎన్ని కేసులు పెట్టినా.. జైళ్లకు పంపించినా రైతుల పక్షాన పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ తేల్చిచెప్పారు.ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, భారాస నేతలు శ్రీనివాస్‌గౌడ్, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు చర్యలు

విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు. 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళు తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశామన్నారు.మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల(ఇ÷ఎ)అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు. 5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటుచేశామన్నారు. దిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు. దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్/మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## ప్రజల దృష్టిని మళ్లించేలా రాజకీయ ఎత్తుగడలు

నెల 26 నుంచి రైతు భరోసా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని జీవన్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్‌పై విచారణ జరుగుతోందని, అయితే తనపై వచ్చిన ఆరోపణలను కేటీఆర్ వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫార్ములా కేసు రేసు నుంచి దృష్టి మరల్చే ఎత్తుగడలను కేటీఆర్ చేస్తున్నారని ఆక్షేపించారు.శుక్రవారం సీఎల్పీ మీడియా పాయింట్‌లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము దీక్ష చేస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తుందని చెప్పుకోవడానికి బీఆర్ఎస్ నేతలు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిలో దేశంలో ఎక్కడ లేని విధంగా రైతు సంక్షేమం కోసం పాటు పడుతుందని తెలిపారు. రైతు భరోసా పేరుతో ఈనెల 26వ తేదీ నుంచి రైతుకు ప్రోత్సహం కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని జీవన్‌రెడ్డి చెప్పారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో రైతు బంధు పేరుతో ఏడాదికి రూ.8వేల నుంచి రూ.10 వేలు ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.12 వేలు ఇస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రూ.14వేలు కూడా కాంగ్రెస్ ఇవ్వబోతోందని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఎకరాకు రూ.500 బోనస్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. రేషన్ కార్డుల పక్రియ కూడా ఈనెల 26వ తేదీ నుంచి ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ హౌసింగ్ స్కీంను మర్చిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తుందని అన్నారు. బీఆర్ఎస్ 2023 ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీ ఎత్తివేసిందన్నారు. బీజేపీ రుణమాఫీ మాట ఊసే ఎత్తలేదని చెప్పారు. కాంగ్రెస్ రుణమాఫీ చేస్తుంటే కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండి నీతి ఆయోగ్‌లో ప్రస్తావిస్తే బాగుండేదని తెలిపారు. రైతాంగానికి ఉచిత విద్యుత్ మొదటగా కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిందని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు.సన్నాలు పండిస్తే తెలంగాణలో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా రూ.500 బోనస్ ఇవ్వట్లేదని చెప్పారు. రేషన్ కార్డుల జారీని గత ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. ఈ నెల 26 నుంచి వీటి జారీ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.'గత ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు.. వడ్డీ మాఫీ చేసింది. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారమే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ కోసం కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు సాయం చేసి ఉంటే ప్రభుత్వానికి ఉపయోగపడేది' అని జీవన్‌రెడ్డి తెలిపారు.

## ఉద్యోగుల పనితీరుపై నిఘా ఉండాల్సిందే

**అమరావతి,జనవరి17( వెలుతురు):**

ఉద్యోగుల పనితీరుపై సున్నితమైన విజిలెన్స్ ఉండాలని.. వారు అప్రమత్తంగా, అత్యుత్తమంగా పని చేయడానికి ఇది ఉపయోగపడుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఉద్యోగుల నిజాయతీ, పనితీరు, నిబద్ధతకు అది ఓ సూక్ష్మదర్శినిలా పని చేస్తుందన్నారు. ఉద్యోగులపై నమోదవుతున్న విజిలెన్స్ కేసులు, శాఖాపరమైన విచారణలు, దర్యాప్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోవడం వల్ల ఉద్యోగుల పనితీరుపై ప్రభావం చూపిస్తుందన్నారు. కొన్ని కేసులు 20 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని.. ఇలా అపరిష్కృతంగా ఉండటం వల్ల ఉద్యోగ విరమణ తర్వాత ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేకపోతున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు, శాఖాపరమైన విచారణలకు సంబంధించిన విచారణలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్., అటవీ, పర్యావరణ శాఖల్లో ఉన్న శాఖాపరమైన కేసుల వివరాలు, అవి ఎంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయనే అంశంపై ఆరా తీశారు. అందుకు గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. నివేదికను మూడు వారాల్లోగా ఇవ్వాలని ఆదేశించారు. అయితే, అభియోగాలు వచ్చిన వారిపై విచారణ ప్రారంభించినపుడు దానికి తగిన పత్రాలు అందుబాటులో ఉండటం లేదని, ఇది విచారణలో జాప్యానికి కారణం అవుతోందని అధికారులు పవన్ దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. తన శాఖల పరిధిలో విజిలెన్స్ రిపోర్టుల ఆధారంగా తీసుకునే చర్యల్లో వేగం పెంచేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు సూచించారు. ఏదైనా విషయంలో అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు వస్తే ప్రాథమిక విచారణ పకడ్బందీగా జరపాలన్నారు. ప్రాథమిక విచారణలోనే బలమైన ఆధారాలు సేకరించాలన్నారు. విచారణ అధికారి, ఆరోపణలు వచ్చిన ఉద్యోగికి మధ్య ఎలాంటి సన్నిహిత సంబంధాలు లేకుండా తొలి దశలోనే నిరోధించాలని స్పష్టం చేశారు. అన్ని విజిలెన్స్, నాన్ విజిలెన్స్ కేసులను సరైన, సక్రమమైన పద్ధతిలో తిరిగి విచారించి వేగంగా వాటిని పరిష్కరించేందుకు ఆయా శాఖల అధిపతులు దృష్టి సారించాలన్నారు.

# రాష్ట్ర పతి చేతుల మీదుగా అర్జున అవార్డు అందుకున్న దీప్తి జీవంజీ



**( రాపర్తి భాస్కర్ గౌడ్)**

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 17:** భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము (ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ) చేతుల మీదుగా శుక్ర వారం నాడు అర్జున అవార్డు ను పారా ఒలింపియన్ దీప్తి జీవంజికి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కు రాష్ట్ర పతి ముర్ము అభినందనలు తెలిపారు, దీప్తి విజయాలు దేశాన్నికి తెలంగాణకి గర్వకారణం, తెలంగాణ యువతకి ప్రేరణ, ఆదర్శం. ఇలాంటి విజయాలు ఎన్నో సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లుగా రాష్ట్ర పతి ముర్ము తెలిపారు,

# వనస్థలి పురం లో గ్రంథాలయం ఏర్పాటు కు స్థల పరిశీలన



**వెలుతురు, వనస్థలి పురం, జనవరి 17:**

వనస్థలి పురం ఎన్జీఓ కాలనీలో నూతన గ్రంథాలయం భవన నిర్మాణానికి శుక్ర వారం నాడురంగారెడ్డి జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి స్థల పరిశీలన చేశారు, ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయం ప్రతినిధులు. జిల్లా గ్రంథాలయం సంస్థ కార్య దర్శి కలిసి గ్రంథాలయం నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు, అనంతరం ప్రస్తుత గ్రంథాలయాన్ని పరిశీలించి దాన్నిలో ఉన్న పుస్తకాలను, గ్రంథాలను మరియు ఇతర ఫర్నీచర్లను పరిశీలించారు, గ్రంథ పఠనం చేసే వారికి కావాల్సిన వస్తువులు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, ఎన్జీఓ కాలనీ లో అనేక మంది ఉద్యోగ విరమణ పొందిన వారు మరియు ఇతర నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పన కోసం అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ మధు సూధన్ రెడ్డి అధికారులను కోరారు, అలాగే ఇక్కడ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్న జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ మధు సూధన్ రెడ్డి ని అభినందిస్తూ ఆయనను ఘనంగా సన్మానించారు,

# కుడా ఏర్పాటు ను వ్యతిరేకిస్తూ గవర్నర్ ను కలిసిన ప్రజా సంఘాల ప్రతినిధులు



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 17:**

ఖమ్మం జిల్లా కొత్తగూడెం ,పాల్వంచ సుజాతనగర్ లను కలిపి "కుడా"చేయటాన్ని వ్యతిరేకిస్తూ పలు ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తూ రాష్ట్ర గవర్నర్ వర్మ ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు, అలాగే గిరిజన చట్టాలు ,రాజ్యాంగ హక్కులు కాపాడాలని గవర్నర్ ను కలిసి వినతి పత్రం అందజేయడంతో పాటు అక్కడ కూడా ను ఏర్పాటు చేస్తే జరిగే పరిణామాలను గవర్నర్ కు వివరించారు ,ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ వినతి పత్రాన్ని పరిశీలించి ప్రజా ఉపయోగ చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించనున్నట్లుగా తెలిపారు,

# కార్పొరేటుకు ధీటుగా మహబూబ్‌నగర్ హాస్పిటల్

- ఉగాది నుంచి ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు ప్రారంభం
- త్వరలో అందుబాటులోకి కార్డియాలజీ సహా పలు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- ఉమ్మడి జిల్లా హాస్పిటళ్ల అభివృద్ధికి సుమారు వంద కోట్ల కేటాయింపు
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో సమావేశంలో మంత్రి దామోదర వెల్లడి
- ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచన
- మంత్రి దామోదరకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యేలు





**హైదరాబాద్ వెలుతురు జనవరి 17:**

మహబూబ్‌నగర్ జనరల్ హాస్పిటల్‌ను కార్పొరేట్ హాస్పిటళ్లకు ధీటుగా అభివృద్ధి చేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హాస్పిటల్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సుమారు ?10 కోట్లతో ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటు చేసి, ఉగాది నుంచి సేవలు ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే కార్డియాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను సైతం మహబూబ్‌నగర్‌లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని మెడికల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని హాస్పిటళ్ల పనితీరు, వైద్యారోగ్య సేవలపై మంత్రి రివ్యూ చేశారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూధన్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్ఎస్‌లు, సూపరింటెండెంట్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల ట్రీట్‌మెంట్ కోసం పేషెంట్లు హైదరాబాద్ వరకూ వెళ్లాల్సి వస్తోందని ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. మహబూబ్‌నగర్ జనరల్ హాస్పిటల్‌లో కార్డియాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి, వీలైనంత తొందరలో సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 5 మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటళ్లు, జిల్లా, ఏరియా హాస్పిటళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇందుకోసం సుమారు వంద కోట్లు ఖర్చు అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. సివిల్ వర్క్స్, ఎక్విప్‌మెంట్, ఇతర సర్వీసెస్‌కు సంబంధించి పూర్తి వివరాలతో, వేర్వేరుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

ఉమ్మడి జిల్లాలో కొత్త సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బస్తీ దవాఖాన్ల ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. అవసరమైనన్ని కొత్త హాస్పిటళ్లను మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యేలతో చర్చించి జిల్లా భౌగోళిక పరిస్థితులు, హాస్పిటళ్ల మధ్య దూరం, జనాభా తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని శాస్త్రీయంగా కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు ఇతర హాస్పిటళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పేషెంట్ లోడ్‌కు అనుగుణంగా డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు.

ఉమ్మడి జిల్లాలో కొత్తగా 4 సెంట్రల్ మెడిసినల్ స్టోరేజ్ సెంటర్లు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మెడిసిన్ సప్లై, పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకో త్రీమెన్ కమిటీ వేశామన్నారు. హాస్పిటళ్లలో మెడిసిన్ ఉండేలా చూసుకునే బాధ్యత ఈ కమిటీదేనన్నారు. ఎక్కడైనా మెడిసిన్ లేవని పేషెంట్లకు ఇబ్బంది కలిగిస్తే కమిటీపై చర్యలుంటాయని హెచ్చరించారు. డాక్టర్లు సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోలు, హాస్పిటల్ సూపరింటెండెంట్లదేనని మంత్రి గుర్తు చేశారు. సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీల కోసం రాష్ట్ర స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలు ఎప్పుడైనా తనిఖీలకు రావొచ్చునని, ఆ సమయంలో డ్యూటీలో లేకపోతే వెంటనే చర్యలుంటాయన్నారు. అందరూ బాధ్యతగా పని చేయాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని మంత్రి సూచించారు.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యేలు అన్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ కోసం ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో ఒక్కో పేషెంట్ ?3 నుంచి 5 వేలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోందన్నారు. దశాబ్ద కాలంగా పేషెంట్లు పడుతున్న ఇబ్బందులకు ఇప్పుడు పరిష్కారం దొరుకుతుందన్నారు. జిల్లా వైద్యారోగ్య సేవలను మెరుగుపరుస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గారికి, సీఎం రేవంత్ రెడ్డి గారికి జిల్లా ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు.

# కేబుల్ టెలివిజన్ నెట్వర్క్ నిబంధనల్లో కీలక సవరణలు ప్రవేశపెట్టిన సమాచార - ప్రసార మంత్రిత్వ శాఖ

- సులభతర వాణిజ్యం సవరించిన నిబంధనల ప్రకారం బ్రాడ్ కాస్ట్ సేవా పోర్టల్ ద్వారా పూర్తిగా ఆన్ లైన్ లో స్థానిక కేబుల్ ఆపరేటర్ల నమోదు
- స్థానిక కేబుల్ ఆపరేటర్లకు నమోదు అధీకృత సంస్థగా సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ..
- స్థానిక ఆపరేటర్ల నమోదు చెల్లుబాటు ఐదేళ్లకు పెంపు, దేశవ్యాప్తంగా విస్తరించనున్న పరిధి

**వెలుతురు 17 జనవరి 2025 పిఐబీ ఢిల్లీ :**

స్థానిక కేబుల్ ఆపరేటర్ల (ఎల్ సీవో) నమోదు ప్రక్రియను క్రమద్ధీకరించడం కోసం కేబుల్ టెలివిజన్ నెట్వర్క్ నిబంధనలు, 1994కు సవరణలు చేస్తూ సమాచార – ప్రసార మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. జారీ చేసిన తేదీ నుంచే ఇవి అమలవుతుండగా.. స్థానిక కేబుల్ ఆపరేటర్ల నమోదు ఇకపై పూర్తిగా ఆన్లైన్ లో జరుగుతుంది. ఆ నమోదులకు సంబంధించి సమాచార ప్రసార మంత్రిత్వ శాఖే అధీకృత సంస్థగా ఉంటుంది. ఆధార్, పాన్, సీఐఎన్, డీఐఎన్ సహా దరఖాస్తుదారు వివరాలన్నింటినీ సక్రమంగా

सूचना एवं
प्रसारण मंत्रालय
MINISTRY OF
INFORMATION AND
BROADCASTING
सत्यमेव जयते

ధ్రువీకరించిన తర్వాత స్థానిక కేబుల్ ఆపరేటర్ల నమోదు ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతాయి. నమోదు తిరస్కరణపై అప్పీలు చేసుకోవడానికీ లేదా ఎల్ సీవో నమోదు పునరుద్ధరణకూ సంబంధించిన ఏర్పాట్లను కూడా చేశారు. గతంలో, ఎల్ సీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలోని స్థానిక ప్రధాన పోస్టాఫీసులో ఆఫ్ లైన్ పద్ధతిలో ఈ నమోదు ప్రక్రియ నిర్వహించేవారు. ప్రధాన పోస్టుమాస్టరు నమోదు అధికారిగా ఉండేవారు. ఈ తరహా నమోదు ప్రక్రియ అయోమయంతో కూడి ఉండడంతోపాటు ఎక్కువ సమయం తీసుకునేది. అలాగే, నమోదును పొందిన తర్వాత కార్యకలాపాలు నిర్వహించగల పరిధి నిర్దిష్ట ప్రాంతాలకు పరిమితమై ఉండేది.

**ఎల్ సీవో నమోదుకు సంబంధించి సవరించిన నిబంధనల్లోని ప్రత్యేకమైన అంశాలు:-**

a. కొత్తగా నమోదు లేదా నమోదు పునరుద్ధరణ కోసం ఎల్ సీవోలు సమాచార ప్రసార మంత్రిత్వశాఖ బ్రాడ్ కాస్ట్ సేవా పోర్టల్ (www.new.broadcastseva.gov.in) ద్వారా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. నమోదు ధ్రువీకరణ పత్రం ఆన్లైన్ లో జారీ అవుతుంది.

b. ఎల్ సీవో నమోదుల మంజూరు లేదా పునరుద్ధరణ ఐదేళ్ల కాలానికి జరుగుతాయి.

c. నమోదు లేదా పునరుద్ధరణ కోసం ప్రాసెసింగ్ ఫీజు రూ. అయిదు వేలు.

d. దేశమంతటా కార్యకలాపాల నిర్వహణ కోసం ఎల్ సీవో నమోదు చెల్లుబాటు అవుతుంది.

e. నమోదు పునరుద్ధరణ దరఖాస్తులను గడువుకు కనీసం 90 రోజుల ముందు చేసుకోవాలి.

f. నమోదు లేదా పునరుద్ధరణలను నమోదు అధికారి (నియమిత సెక్షన్ ఆఫీసర్) తిరస్కరిస్తే, ఆ నిర్ణయంపై తిరస్కారం పొందిన 30 రోజుల్లోగా ఎల్ సీవోలు ఉప కార్యదర్శి (డీఏఎస్) ఎదుట అప్పీలు చేసుకోవచ్చు.

SANKARA EYE FOUNDATION, INDIA®
Sri Kanchi Kamakoti Medical Trust
Phoenix Foundation
KOMATIREDDY SUSHEELAMMA FOUNDATION
కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్
ఆధ్వర్యంలో
జిల్లా అంధత్వ నివారణ సంస్థ
శంకర కంటి ఆసుపత్రి మరియు ఫీనిక్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న
నానక్‌రామ్‌గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్
ఉచిత కంటి వైద్యశిబిరం



ఫోన్: 040-23456600, 7845878423, 9789645361
తేది: 19.01.2025, ఆదివారం
సమయం: ఉ॥ 9గం॥లనుండి మ॥ 2గం॥ల వరకు
స్థలం: కోమటిరెడ్డి గారి క్యాంప్ కార్యాలయం-మునుగోడు

ఈనెల 19న(ఆదివారం)
మునుగోడులో
ఉచిత కంటి వైద్య శిబిరం
మునుగోడు నియోజకవర్గ (మునుగోడు, చండూరు, గట్టుప్పల్ మండలాల ప్రజలకు మాత్రమే) ప్రజలకు శుభవార్త. ఈనెల 19న(ఆదివారం) మునుగోడు లో ఉచిత కంటి వైద్య శిబిరం
కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి మరియు ఫీనిక్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగలరు
సమయం:-
ఆదివారం ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు
వేదిక:-
కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారి క్యాంపు కార్యాలయం మునుగోడు
గమనిక:-
గ్రామాల నుండి పేషెంట్ వైద్య శిబిరానికి రావడానికి ఉచిత రవాణా సౌకర్యం కలదు. కంటి పరీక్షల అనంతరం ఉచిత ఆపరేషన్ సౌకర్యం కూడా కలదు
ముఖ్య గమనిక:-
వైద్య శిబిరానికి వచ్చే ప్రతి పేషెంట్ తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకుని రాగలరు

# సంపాదకీయం..


## రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలేవీ ?

ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటి ప్రభావం ధరలపై పడుతోంది. తద్వారా సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. మరో పదిరోజుల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు సిద్దమవుతున్న వేళ..ఈ దిద్దుబాటు చర్యలు ఉంటాయా అన్నది అనుమానంగానే ఉంది. ఎవరిదారి వారిది అన్న చందంగా ప్రభుత్వం నడుస్తోంది. ధరలు అదుపులోకి రావడం లేదు. నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. కానీ బడ్జెట్‌లో దిగుమతి సుంకాలు పెంచే ప్రయత్నం చేస్తామని అంటున్నారు. ఇలా చేయడం వల్ల రూపాయి విలువ పెరుగుతుందనుకుంటే పొరపాటు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగిం చుకుని వస్తూత్పత్తిన పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జిఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం.ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలుబాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మైనముని మోదీ మాత్రం నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడి పోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోదీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది. మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు నిత్యావసర వస్తువుల ధరలు కూడా దారుణంగా పెరిగాయి. పప్పుల ధరలు 250కి కిలోగా ఉన్నాయి. ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపు తున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా బలమైన అడుగులు పడకపోతే, భారతదేశం మరింతగా నష్టపోవడం ఖాయం. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి. మనకు సహజవనరులతో పాటు, మానవ వనరులు విశేషంగా ఉన్నాయి. వాటిని ఉపయోగించుకుని వస్తూత్పత్తని పెంచుకుంటే తప్ప ముందుకు సాగలేం. ఇలాగే మీనమేషాలు లెక్కిస్తూ జిఎస్టీ పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని చూస్తే సామాన్యుల బతుకులు ఛిద్రం కాగలవని గుర్తించాలి.

# సవాళ్లతో చట్టాలను చులకన చేస్తారా ?

- అనుమతి లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారు
- దబాయింపు రాజకీయాలతో ప్రజలు వంచిస్తారా
- కెటిఆర్ సవాళ్ల రాజకీయాలపై సర్వత్రా విమర్శలు

హైదరాబాద్,జనవరి17( వెలుతురు):





ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాళ్ల విసరుతూ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్షలకు రావాలని సవాల్ చేస్తున్నారు. సిఎం రేవంత్‌ను లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ చేయడం ఆయన అసహనాన్ని తెలియచేస్తోంది. కుంభకోణం లేదు..లంబకోసం లేదు..లొట్టపీసు కేసు అంటూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. పదేళ్లపాటు దర్జాగా పాలన సాగించి, దగా చేసిన నేతలు ఇవాళ సవాళ్లు విసరుతున్నారు. సవాళ్లు విసిరితే ఇక చట్టాలు ఎందుకు..? కోర్టులు ఎందుకో చెప్పాలి. ఫార్ములా కార్ రేసులో తప్పు చేయలేదని అంటున్నారు. తప్పు చేయకపోతే...నేరుగా 55 కోట్లు ఎందుకు తరలించారన్నదానికి సమాధానం చెప్పాలి. నీ ఇష్టం వచ్చినట్లుగా డబ్బులు విడుదల చేసే అధికారం ఎవరిచ్చారన్నది చెప్పాలి. గురువారం ఉదయం ఈడీ విచారణకు హాజరు కావడానికి మందీ మార్బలాన్ని వెనకేసుకుని రావడం ఎక్కడి ప్రజాస్వామ్యమో చెప్పాలి. కెటిఆర్ విచారణకు వెళుతున్నారా లేక ..ఏదైనా విజయయాత్రకు వెళుతున్నారా చెప్పాలి. చేసిన తప్పులకు ప్రజాకోర్టులో ప్రజలు ఇప్పటికే శిక్షించారు. కెటిఆర్ విచారణకు వస్తుంటే దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించాల్సి వచ్చింది. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. కాగా.. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇంత జరిగినా కెటిఆర్‌కు తాను చేసిన తప్పేంటో తెలియడం లేదని అనుకుంటే ఎలా. తప్పు చేయలేదని నటించినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అంటున్నారు.

'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో మంచిదని చెబుతున్నారు. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ వచ్చి నగరాన్ని కీర్తించారట. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది అంటూ వితండవదం చేస్తున్నారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని చేస్తున్న వాదన ఆయన అమాయకత్వాన్ని చాటుతోంది. ఆయన ఇన్నాళ్లూ ఎలాంటి జ్ఞానం లేకుండా మంత్రిగా వెలగబెట్టారని అర్థం అవుతోంది.

# ఉమ్మడి ఎపి కోసం ఆనాడు గట్టిగానే పోరాడాం

- విభజన వల్ల నష్టపోయేది రాయలసీమ అని చెప్పాం
- సీమకు ప్రాజెక్టుల వల్లనే మేలు జరగగలదు
- మాజీ ఎంపి టిజి వెంకటేశ్ వెల్లడి

కర్నూలు,జనవరి17( వెలుతురు):



ఆంధ్రప్రదేశ్ సమైక్య రాష్ట్రంగా ఉండాలని పోరాటం మొదలు పెట్టింది తానేనని, రాయలసీమ ప్రాంతం వెనకబడిందని ఆధారాలతో సహా రాజకీయ పార్టీలకు ఇచ్చామని.. అప్పుడు ప్రణబ్ ముఖర్జీ మాకు పూర్తి మద్దతు తెలిపారని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. విడిపోతే నష్టపోయేది రాయలసీమేనని ఆనాడు గట్టిగా వాదించామని చెప్పారు. శుక్రవారం ఆయన కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ విభజనకు అప్పటి సిఎంగా ఉన్న రోశయ్య మద్దతు తెలపలేదని చెప్పారు. ట్యాంకు బండ్‌పై విగ్రహాలు పగలకొడుతున్నప్పుడు శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం పగలగొట్టే ముందు మాపై దాడి చేయండని కోరానని.. వెంటనే ఆందోళన కారులు మమ్మల్ని గౌరవించి వెనక్కి వెళ్ళారన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలు చేసే దిశగా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చర్యలు మొదలు పెట్టాలని, విభజన హామీల అమలుకు తెలంగాణ పొలిటికల్ పార్టీలు కూడా సహకరిం చాలని టీజీ వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఎపీలో కేంద్రం నిధులు ఇచ్చే ప్రాజెక్టులే వేగంగా ముందుకు వెళు తున్నాయని, తెలుగు రాష్ట్రల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు ముఖ్యమైన ప్రాజెక్టులపై దృష్టి సారించాలని టీజీ వెంకటేష్ సూచించారు. ఏపీ పారిశ్రామిక వేత్తలు తెలంగాణలో ట్యాక్సులు కడుతున్నారని, అందులో మనకు రావాల్సిన షేర్లు రావడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీనిపై చొరవ తీసుకోవాలన్నారు. సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జితో ప్రాజెక్టు చేపట్టాలని కేంద్ర మంత్రి గడ్కరిని కోరానని, అందుకు గడ్కరి అంగీకారం తెలిపారన్నారు. కానీ గత ప్రభుత్వం అందుకు ప్రతిపాదనలు పంపక పోవడం వల్ల ఆ ప్రాజెక్టు వెనక్కి వెళ్లిందన్నారు. రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామని, గత ప్రభుత్వం అనుమతి లేకుండా పోతిరెడ్డిపాడు వద్ద రాయలసీమ ఎత్తి పోతల పథకం చేపట్టిందని, దీంతో ఆ ప్రాజెక్టు మధ్యలోనే ఆగిందని, భారీగా ప్రజాధనం వృథా అయిందని టీజీ వెంకటేష్ అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, రాయలసీమలో పారిశ్రామిక విప్లవం వస్తోందని, తన కుమారుడు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సీమలో ప్రాజెక్టుల స్థాపనకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, ఆయకట్టు మొత్తానికి నీరు అందించేలా కాలువల పనులు చేపట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీలు ఇంకా నిషాలో ఉన్నాయని, కేంద్రం పెద్దల నిర్ణయం మేరకే రాష్ట్ర నాయకత్వ మార్పు ఉంటుందని టీజీ వెంకటేష్ అన్నారు. బీజేపీ పెద్దలు.. మెగాస్టార్ చిరంజీవి స్నేహ పూర్వకంగా ముందుకు వెళు తున్నారని, తదుపరి విషయాలు తనకు తెలియవని అన్నారు. సీఎం చంద్రబాబు అనుభవం వల్ల కూటమి ప్రభుత్వం ఏడు నెలల పాలన అద్భుతంగా ఉందని కొనియాడారు. డోన్ టీడీపీ నాయకుడుపై దాడి చేసిన వారిని రెండు రోజుల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు మొదలవు తాయని, గత ప్రభుత్వంలో ఆలయాలపై ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కర్నూల్‌కు హైకోర్టు బెంచ్ గతంలోనే వచ్చేదని, కానీ కొంతమంది న్యాయవాదులు ఆందోళనలు చేయడం వల్ల ఆగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తుందని టీజీ వెంకటేష్ అశాభావం వ్యక్తం చేశారు.

# అమెరికన్లను దెబ్బతీస్తున్న హెచ్-1బి

- లాకెన్ రిలే చట్టాన్ని సవరించాల్సిందే
- అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ వెల్లడి

వాషింగ్టన్,జనవరి17( వెలుతురు):



మంచి వేతనాలను అందుకునే అమెరికన్ ఉద్యోగులను తొలగించేందుకే హెచ్-1బి ఉపయోగపడుతోందని అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ ఆరోపించారు. వారి స్థానంలో తక్కువ వేతనాలకే వచ్చే విదేశీ కార్మికులను అధిక సంఖ్యలో కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆక్షేపించారు. హెచ్-1బి వీసాలకు అవకాశం కల్పిస్తున్న లాకెన్ రిలే చట్టాన్ని సవరించాలని కోరుతూ చట్టసభలో ఒక ప్రతిపాదనను శాండర్స్ ప్రవేశపెట్టారు. హెచ్-1బి వీసాల కోసం కంపెనీలు చెల్లించాల్సిన రుసుములను రెట్టింపు చేయాలన్నారు. దీని ద్వారా లభించే ఆదాయంతో 20వేల మంది అమెరికన్ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వవచ్చని తెలిపారు. హెచ్-1బి కార్మికులకు కంపెనీలు చెల్లించే వేతనాలను కూడా భారీగా పెంచాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలకు వచ్చే విదేశీ కార్మికులను నియమించుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థలు భారీ మొత్తంలో డబ్బును మిగుల్చుకుంటున్నాయని విమర్శించారు. హెచ్-1బి వీసాలను సమర్థిస్తున్న టెస్లా అధినేత ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలపైనా శాండర్స్ విమర్శలను సంధించారు. ఇదిలావుంటే హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడ వెల్లడవుతోంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం క్షోభపెడుతోంది. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా గెలవటంతో ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పారు. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు. అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళుతున్నారు. 2021-24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం లభిస్తోందనీ ఇప్పటికీ చెప్పలేం. ఎన్నోరూపాల్లో శ్వేతజాతి ఆధిక్యతా ధోరణులు ఎదురవుతున్నాయి. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్ణానికీ పెద్దపీట వేయాలనే తర్కానికీ ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా నిలువరించాల్సిందే.

## శివరాజ్ గౌడ్ మాతృమూర్తి సావిత్రమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎమ్మెల్యేలు ...





**కూకట్ పల్లి జనవరి 17 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సాయి నగర్ వెస్ట్ కాలనీకి చెందిన సీనియర్ నాయకులు పోచారం శివరాజ్ గౌడ్ మాతృమూర్తి పోచారం సావిత్రమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా శేరిలింగంపల్లి శాసనసభ్యులు పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి సావిత్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాశీనాథ్ యాదవ్, విష్ణువర్ధన్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, ఆంజనేయ ప్రసాద్ గౌడ్, విఠల్ గౌడ్, హరి ప్రసాద్, సౌందర్య, అమృత, ఉమామల్లిక, లావణ్య, లక్ష్మీ, రాజేశ్వరి, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత ఆదివాసి ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



**వెలుతురు,సిటీ కల్చరల్ 17, జనవరి :**
అఖిల భారత ఆదివాసి ఉద్యోగుల సంఘం, తెలంగాణ రాష్ట్ర శాఖ నూ తన సంవత్సర డైరీ ఆవిష్కరణ కా ర్యక్రమం శుక్రవారం కాచిగూడలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మరకల ప్రసన్నకు మారి అధ్యక్షత వహించిన కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా సంఘ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవర కొండ వెంకటేశ్వర్లు ఆవిష్కరించి, ప్రసంగించారు. ఆదివాసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జాతీ య ప్రధాన కార్యదర్శి చెవూరి పద్మ జ, సెక్రటరీ జనరల్ రాచ గిరి మధు సూదన్ రావు, సంఘ భావజాలం సిద్ధాంతకర్త పాలపర్తి బాలాజీ, ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సాంబశివరావు తదిత రులు పాల్గొని తెలంగాణలో జరిగే భవిష్యత్ కార్యక్రమాల గురించి చ ర్చించడం జరిగింది. అనంతరం ప్ర ముఖుల ప్రసంగాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఉ స్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్స్ విశ్రాంత, (యుసి ఒఎస్ఎస్) ప్రిన్సిపాల్ కూతాడ అ ర్జున్ రావు చేసిన సేవలను గుర్తిం చి వారికి సంఘ తరఫున సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ జనరల్ కం దుల ఝాన్సీ, దేవరకొండ కోటేశ్వ రి, ఏపీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ సాలా భోగేశ్వరరావు, బహుజన వాది కందుల ధన లక్ష్మి, మరకాల ప్రతిమ, మరకాల సత్యవతమ్మ, మరకల యాదగిరి, మరకాల అను రాధ, కట్ట పద్మావతి, కట్ట తేజ, దేవ రకొండ రాములు, చేవూరి రమణ మ్మ, పల్లకొండ నరేందర్, రాగిరి అనంతప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**వెలుతురు, పెద్ద అంబర్ పేట్, జనవరి 17:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పెద్దఅంబర్ పేట్ పురపాలక సంఘం చివరి కౌన్సిల్ సమావేశానికి శుక్ర వారం హాజరైన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి , ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ లో పెండింగ్ లో ఉన్న పనులను త్వరతగతిగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజల ముందుకు రావాలని సూచించారు,ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పండుగల జయశ్రీ రాజు, వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి, పెద్ద అంబర్ పెట్ మున్సిపల్ కౌన్సిలర్లు,కో అప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పరిశీలన

- అదునపు జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 17**
సిరిపురం గ్రామం నందు జరుగుతున్న రేషన్ కార్డు పరిశీలన, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పరిశీలన అడిషనల్ యాదాద్రి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. లబ్ధిదారులు పరిశీలన వేగవంతంగా, సరైన డేటా తో పరిశీలన ను పూర్తి చేయాలనీ తగు సూచనలు చేయడం జరిగింది. లబ్ధిదారులు ఇండ్లు స్వయంగా పరిశీలన చేయడం జరిగింది. వీరి వెంట మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్ మండల పంచాయతీ అధికారి, APO హాజరువడం జరిగింది.

# కేటీఆర్ అబద్ధపు మాటలకి లై డిటెక్టర్లు పేలిపోయేలా ఉన్నాయి

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం...

**కూకట్ పల్లి జనవరి 17 వెలుతురు:**
ఈడీ, ఏసీబీ మొదటి విచారణలోనే మాజీ మంత్రి కేటీఆర్ కళ్ళల్లో భయం కనపడింది కేటీఆర్ కు చిప్ప కూడు తప్పదని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ముఖ్యమంత్రిని లై డిటెక్టర్ పరీక్షకి సిద్ధమా అని కేటీఆర్ సవాల్ విసరడం పై ఆ అర్హత కెటిఆర్ కు ఉందా అని ఆయన ప్రశ్నిస్తూ శుక్రవారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు డా. సత్యం శ్రీరంగం, సంధ్య రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కేటిఆర్ ఈడీ ఆఫీస్ నుండి బయటకు వచ్చి మీసాలు తిప్పుతున్నాడని, ముఖ్యమంత్రి ని లైవ్ డిటెక్టర్ టెస్ట్ చేయాలి అని వ్యాఖ్యలు చూస్తుంటే కామెడీ సీన్స్ గుర్తుకొస్తున్నాయి అన్నారు. సుప్రీం కోర్టుకు వెళ్లి పిటిషన్ విత్ డ్రా చేసుకొని




నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయలు విదేశాలకు పంపిస్తే తప్పు కదా ?.. అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిని లై డిటెక్టర్ కు రమ్మనే అర్హత కేటిఆర్ కు లేదని, కేటీఆర్ లోపల ఎంత భయపడ్డాడో అందరికి అర్థం అవుతుందని పేర్కొన్నారు. అవినీతే లేదని లొట్ట పీసు కేసు అన్న కేటీఆర్ లొట్టపీసు ఎందుకు అంత భయమని అన్నారు. రేవంత్ రెడ్డిపై 80 కేసులు ఉన్నాయని నీలాగా లొట్టపీసు కేసులు కాదు ఏ రోజు భయపడలేదు దైర్యంగా ఎదుర్కున్నాడని అన్నారు. కేటీఆర్ 55 కోట్లు దోచుకున్న నీకు విచారణ, జైలు కూడు తప్పదు అని అన్నారు. కేటిఆర్ మున్సిపల్ మంత్రి గా దోచుకున్నవి అన్ని కక్కిస్తాం 6 నెలలు చంచల్ గూడ జైల్ లో ఉండటం ఖాయమని ఏ దారి లేదు జైలుకు పోవడమే తప్ప అన్నారు. తప్పుచేస్తే చట్టం ఎవ్వరిని వదిలిపెట్టదని, ఎవరికైనా శిక్ష తప్పదని అన్నారు. ముక్కు నేలకు రాసి బట్టలు లేకుండా తిరిగినా ప్రజలు మిమ్ముల్ని నమ్మరు కేటిఆర్, అన్ని కేసులు విచారిస్తే కెటిఆర్ 60 సంవత్సరాలు బయటకు రాడు, అవినీతి పునాదుల మీద బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ కట్టారు. అతి చిన్న బీఆర్ఎస్ పార్టీకి అన్నికోట్ల పార్టీ ఫండ్ ఎక్కడిది శ్రీరంగం కేటీఆర్ ని ప్రశ్నించారు.

# పేదలకు అండగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం

- ఇబ్రహీం పట్నం లో ఇందిరమ్మ మోడల్ హౌస్ కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, జనవరి 17:**
అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు, ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్ర వారం ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణనికి భూమి పూజ చేసి పనులను శాసనసభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ ఇబ్రహీం పట్నం నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ పేద వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత తనదే అని రంగారెడ్డి తెలిపారు,మొదటి విడతగా 3500 ఇళ్ల ను నిర్మించి ప్రతీ గ్రామంలో నిజమైన పేదలను గుర్తించి ఇల్లు అందిస్తామన్నారు నియోజకవర్గం మొత్తం 20 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేదలకు అందించే బాధ్యత తమదన్నారు. ఎన్నికల సమయంలో మేము ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులతో పాటు , ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



# అల్వాల్ నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్య సేవల పునఃప్రారంభం





**అల్వాల్ వెలుతురు జనవరి 17:**
జిల్లా అభివృద్ధి, సమన్వయం మరియు మానిటరింగ్ కమిటీ (DISHA) సమావేశంలో జరిగిన చర్చల ప్రకారం అందించిన సూచనల మేరకు జిహెచ్ఎంసి హాల్, వెంకటాపూర్ లో ప్రస్తుతము పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే పిల్లలు, గర్భిణీలు, మరియు వృద్ధులకు ఎదురవుతున్న సమస్యల దృష్ట్యా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య కార్యాలయం చర్యలు తీసుకుంది.అల్వాల్ లో నూతనంగా నిర్మించిన భవనంలో వైద్య సేవలను పునఃప్రారంభించి, అన్ని రోగులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. టి. రఘునాథ్ స్వామి గారు ప్రకటించారు. ఈ సౌకర్యంలో పిల్లలు, గర్భిణీలు, మరియు వృద్ధులకు మరియు సామాన్య ప్రజలకు అవసరమైన వైద్య సేవలను సౌకర్యవంతమైన విధానంలో అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు అని పేర్కొన్నారు . జిల్లా వైద్య మరియు ఆరోగ్య కార్యాలయం ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందించడానికి కట్టుబడి ఉన్నది మరియు అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఈ సదుపాయాలను ఉపయోగించుకోవాలని ప్రజలను అభ్యర్థించారు.

# బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించిన తపస్



**భువనగిరి వెలుతురు జనవరి 17:**
రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ బలపరిచిని ముగ్గురు అభ్యర్థులకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్?) మద్దతు ప్రకటించింది. శుక్రవారం హయత్? నగర్? లో తపస్? రాష్ట్ర కమిటి, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి హన్మంతరావు, నవాత్ సురేష్ లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ – నిజామాబాద్ – మెదక్ – ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య, ఉమ్మడి కరీంనగర్ – నిజామాబాద్ – మెదక్ – ఆదిలాబాద్?పట్టభద్రుల నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సి.అంజిరెడ్డి, ఉమ్మడి



వరంగల్? – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తం రెడ్డి తపస్ సమావేశానికి హాజరై ఈ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశానికి బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్? రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తనను ఎమ్మెల్సీగా గెలిపించి ఉపాధ్యాయుల సమస్యలపై చట్టసభలో మాట్లాడేలా చేయడంలో తపస్ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఇప్పుడు బీజేపీ బలపరిచిన ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కమిటీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో మాట్లాడి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సమావేశం లో అభ్యర్థులు మల్క కొమరయ్య, సీ. అంజిరెడ్డి, పులి సరోత్తం రెడ్డి, ఏబీఆర్?ఎస్?ఎం ప్రతినిధులు లక్ష్మణ్ జీ, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట్రావు, రాష్ట్ర పదాధికారులు నరేందర్ రావు, పాపిరెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు బండి రమేష్, తెల్కలపల్లి పెంటయ్య, రామకృష్ణ రెడ్డి లు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బియ్యం,నిత్యావసర సరుకులు దాతగా నిలిచిన మాజీ సర్పంచ్ రాజు నాయక్,రాజేందర్ నాయక్

**సంస్థాన్ నారాయణపురం మండలం**
**వెలుతురు జనవరి 17:**
సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని మర్రి బావి తండా గ్రామపంచాయతీకి చెందిన మెగావత్ పకీర నాయక్



అనారోగ్యంతో మృతి చెందారు.ఈ నేపథ్యంలో వారి కుటుంబానికి అండగా మేము ఉంటాం అని చెప్పి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ నిత్యవసర సరుకులు 50కె కిలోల బియ్యం అందజేసిన మర్రి బావి తండ మాజీ సర్పంచ్ రాజు నాయక్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సబవత్ రాజేందర్ నాయక్.ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# నాణ్యమైన కేబుల్ వాడండి

## నక్క యాదగిరి తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

సికింద్రాబాద్ వెలుతురు జనవరి 17:
పోలీక్యాబ్ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఎలక్ట్రాన్ బీమ్ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పాలీ క్యాబ్ సుప్రీమా విద్యుత్తు తీగలను లాంచనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి, ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మెంబర్ నేమాల బెనర్జీ. రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పాలీ క్యాబ్ సంస్థ ఉద్యోగులు ప్యాట్ని నుంచి రాణిగంజ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాలీ క్యాబ్ ఇండియా లిమిటెడ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ సామ్యూల్ మాట్లాడుతూ అత్యుత్తమమైన అత్యధిక వేడిని సైతం తట్టుకునే విధంగా ఈ వైర్లు రూపొందించినట్లు వెల్లడించారు. గృహోపకారాలతో పాటు వ్యవసాయ ఆధారిత మోటార్లకు ఈ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైర్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇతర కంపెనీలతో పోలిస్తే పాలిక్యాబ్ ఎలక్ట్రాన్ బీమ్ వైర్లు నాణ్యతతో పాటు అధిక వేడిని తట్టుకొని ఎక్కువకాలం మన్నిక ఉంటాయని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజులలో విద్యుత్ భారాన్ని తట్టుకునే విధంగా ఈ తీగలు దోహదపడతాయని అన్నారు. ఈ నూతన ఎలక్ట్రాన్ బీమ్ వైర్లను ఉపయోగించాలని వినియోగదారులకు సూచించారు. ఈ సందర్భంగా నక్క యాదగిరి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలకు తావు లేకుండా పాలిక్యాప్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వైర్లను రూపొందించడం జరిగిందని, వినియోగదారులు వీటిని వాడాలని ఆయన కోరారు. నవీన్ శామ్యూల్ పాలి క్యాబ్ తెలంగాణ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నక్క యాదగిరి తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు ఈ కార్యక్రమంలో పోల్ క్యాప్ వారి కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కేబుల్ వైర్స్ రంగంలో మొదటిసారి అరువై సంవత్సరాలు మన్నికగా ఉండే పోలిక్యాబ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో పోలిక్యాబ్ సుప్రీమా పేరుతో కేబుల్ వైర్ ను లాంచ్ చేసినట్లు ఆ సంస్థ ఆర్గనేజర్స్ తెలిపారు. హెూలీ క్యాంప్ మేనేజర్ రాజశేఖర్ గౌడ్ సుమన్. జనార్ధన్. కళ్యాణ్ చక్రవర్తి. తదితరులు. సికింద్రాబాద్ పోలిక్యాబ్ హెడ్ ఆఫీస్ లో పోలిక్యాబ్ సుప్రీమా కేబుల్ వైర్ ను లాంచ్ చేశారు.. సుప్రీమా ముఖ్య లక్ష్యం ఎలక్ట్రాన్ భీం టెక్నాలజీ ఆని,ఇందులో హై ఫవర్ అంటే 105 డిగ్రీ సెంటిగ్రేడ్ కరంటు సప్లయ్ అయినా తట్టుకొని ఈ వైర్ మెల్ట్ కాకుండా నిలబడుతుందని వారు పేర్కొన్నారు..ఈ వైర్స్ ను వాడడం వల్ల అగ్నిప్రమాదాలు జరుగకుండా నివారించవచ్చు అని,100 పైన కరంటు సప్లయ్ జరిగినపుడు మెల్ట్ కాకుండా ట్రిప్ కాకుండా దృడంగా ఉంటుందని ఆర్గనేజర్స్ తెలిపారు..




# షాబాద్‌లో బీఆర్ఎస్ రైతు మహా ధర్నా

## కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 17:
రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ రైతు మహా ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను రుణమాఫీ పేరిట మోసం చేసిండు. రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేసేందుకు డిసెంబర్ 9న సంతకం పెడుతా అన్నాడు. కానీ పూర్తిగా రుణమాఫీ కాలేదు. నీకు నిజాయితీ ఉంటే.నీ సొంతూరు కొండారెడ్డిపల్లెకు పోదాం.కొడంగల్‌కు పోదాం. రుణమాఫీ అయిందని చెప్తే రాజీనామా కాదు రాజకీయ సన్యాసం తీసుకుంటానని అసెంబ్లీలో చెప్పాను. ఉలుకు పలుకు లేదు. రాష్ట్రంలో ఏ ఊరికైనా సరే.. డేట్, ప్లేస్, టైమ్ నీ ఇష్టం.నువ్వు కాకపోతే నీ మంత్రులను పంపించు. వంద శాతం రుణమాఫీ అయిందని రాసిస్తే మొత్తం బీఆర్ఎస్ నేతలు రాజీనామా చేసి పోతాం. చారాణా రుణమాఫీ కూడా కాలేదు. కానీ ఇవాళ డిల్లీకి పోయి రుణమాఫీ చేసిన అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని కేటీఆర్ నిప్పులు చెరిగారు.కేసీఆర్ మీకు బిచ్చమేసినట్టు రైతుబంధు కింద రూ. 10 వేలు ఇస్తుండు.. నన్ను గెలిపిస్తే రూ. 15 వేలు ఇస్తానని అన్నాడు. ఏడాది దాటిపోయింది.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఎన్నికలప్పుడు రూ. 7600 కోట్లు రైతుబంధు వేసేందుకు మేం సిద్ధమైతే ఈసీకి ఉత్తరం రాసిండు రేవంత్ రెడ్డి. ఈ టైమ్‌లో వేస్తే కేసీఆర్‌కు ఓట్లు వేస్తారని చెబితే మోదీ ప్రభుత్వం ఆపింది. ఎన్నికలు అయిపోయాక రైతులను ఇబ్బంది పెట్టిండు అని కేటీఆర్ విమర్శించారు,కేసీఆర్ హయాంలో నాట్లప్పుడు రైతుబంధు పడుతుండే.ఇప్పుడు ఓట్లప్పుడు పడుతున్నాయి. కేసీఆర్ జమ చేసిన రూ. 7600 కోట్లను పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లప్పుడు వేసిండు.



వానాకాలం పంటకు రైతుబంధు ఇవ్వలేదు. అందుకే ఇవాళ ధర్నా పెట్టాం. ఎందుకంటే.ఇది ప్రారంభం మాత్రమే.రాష్ట్రమంతా ధర్నాలు పెడుతాం. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 15 వేలు ఇవ్వాలి రైతుభరోసా. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వానాకాలం రైతుబందును ఎగ్గొట్టిండు.. దాన్ని కూడా విడిచి పెట్టొద్దు అని కేటీఆర్ చెప్పారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు సబితా ఇంద్రా రెడ్డి,శ్రీనివాస గౌడ్, ఆర్ యస్ ప్రవీణ్ కుమార్,కౌశిక్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, నవీన్ రెడ్డి,నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నగా భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు,

# కష్టపడ్డ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు విలువ లేకుండా పోయింది

- పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి
- కరంటోతూ ప్రజ్ఞా నాయక్ ఐఎన్టీయూసి జిల్లా ఉపాధ్యక్షులు

సంస్థాన్ నారాయణపురం మండలం
వెలుతురు జనవరి 17:
సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా పార్టీ కోసం పది సంవత్సరాల నుంచి పనిచేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు. ఈరోజు పార్టీ అధికారంలోకి వచ్చాకాఎలాంటి ఆదరణ లేకుండా పోయింది అని బయట పార్టీ నుంచి వచ్చిన వాల్లు డబ్బులు కలిగి కార్లలో తిరుగుతూ పార్టీలో చలామణి అవుతున్నారు.ఇలాంటి వ్యక్తులపై కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నామని జెండా మోసిన పార్టీ కార్యకర్తలు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు,వార్డు మెంబర్లు గా పనిచేసిన వారికి కూడా ప్రస్తుత



రాజకీయాలలో దూరం పెడుతున్నారు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కంకణాలగూడెం మాజీ సర్పంచ్ కరంటోతు ప్రజ్ఞా నాయక్ ఆరోపించారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో ఒక్క కార్యకర్తకు కూడా ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని గ్రామాలలోని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని పోవాలన్న కార్లలో తిరిగే నాయకులే ఆయన చుట్టూ చేరి సామాన్య కార్యకర్తను వారి సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఇవ్వకుండా చేస్తున్నారు. హైదరాబాద్ లోని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఇంటికి వెళ్ళినా,మునుగోడు,చౌటుప్పల్ క్యాంప్ ఆఫీస్ కి వెళ్ళినా వాళ్ళే గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటన చేసిన వాళ్లే ముందుంటున్నారు.ఏమైనా సమస్యల పైన ఎమ్మెల్యే తో మాట్లాడే పరిస్థితి లేదు. ప్రభుత్వంలో ఉన్నా లేనట్టుగానే అనిపిస్తుందని గత పది సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వం లో ఎటువంటి అభివృద్ధి చెందని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రస్తుత అధికార పార్టీలో ఉన్న కూడా అదే పరిస్థితి ఏర్పడింది అన్నారు. దీనిపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టి పెట్టాలని అన్నారు.గతంలో వేసిన ఇందిరమ్మ కమిటీలో కూడా పార్టీ కోసం పని చేసిన వారిని కాదని కొంతమంది వ్యక్తులు వారికి నచ్చిన వారినీ కమిటీలో పేర్లు రాయించుకున్నారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో గౌరవ ఎమ్మెల్యే హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం చేసిన మండల అధ్యక్షులు ఎవరికి సమాచారం ఇవ్వకుండా తనూ ఒక వర్గాన్ని ఏర్పాటు చేసుకొని వారికి మాత్రమే తెలియజేయడం జరుగుతుంది అని అన్నారు. మండల అధ్యక్షులుగా నియామకమైనప్పటి నుంచి ఇప్పటివరకు మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఒకటి కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు. ఇప్పటికైనా మునుగోడు ఎమ్మెల్యే పార్టీ కోసం పని చేసే వారు ఎవరు తమ స్వలాభం కోసం పార్టీలు మారే వారు ఎవరో గ్రహించి పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి వారికి నామినేటెడ్ పోస్టులు ఇప్పించలని అన్నారు.సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు న్యాయం చేయాలని మండలంలో జరుగుతున్న కార్యకర్తల ఇబ్బందులను గుర్తించాలని కరంటోతు ప్రజ్ఞా నాయక్ ప్రకటన ద్వారా కోరడం జరిగింది.

# 28వ డివిజన్ బిజెపి పోలింగ్ బూత్ కమిటీ ఎన్నిక

కరీంనగర్ వెలుతురు జనవరి 17:
కరీంనగర్ పట్టణం బిజెపి ఈస్ట్ జోన్ పరిధిలోని 28వ డివిజన్ బిజెపి పోలింగ్ బూత్ కమిటీ ఎన్నిక జరిగింది. అశోక్ నగర్ శక్తి కేంద్ర ఇన్చార్జులు గొట్టిముక్కల వెంకటరమణ , ఉప్పునీటి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోలింగ్ బూత్ నియామక ప్రక్రియలో 224 పోలింగ్ బూత్ అధ్యక్షునిగా జింక శ్యాంసుందర్, 225 బూత్ అధ్యక్షునిగా తూముల ప్రదీప్, 226 బూత్ అధ్యక్షునిగా కందుకూరి శ్రీవాత్సవ, 227 అధ్యక్షునిగా కట్ట రాజేష్, 228 అధ్యక్షునిగా మనోహర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో బూత్ కమిటీ ఎన్నికల పరిశీలకులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దుర్శేటి సంపత్, ఆవుదుర్తి శ్రీనివాస్ డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# క్రీ.శే కర్నె శివలీల- జంగప్ప జ్ఞాపకార్థం సంస్థాన్ నారాయణపురం గ్రామ ప్రజలకు ఉచిత ఫ్రీజర్ బాక్స్ సేవలు.



సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 17:
సంస్థాన్ నారాయణపురం గ్రామ ప్రజల కొరకు కీ.శే కర్నె శివలీల జంగప్ప గార్ల జ్ఞాపకార్థం మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ రూ.60 వేల రూపాయల విలువైన ఫ్రీజర్ బాక్స్ ను గ్రామానికి చెందిన శిరీష పౌండేషన్ నిర్వహకులు చెర్క కిరణ్ కుమార్ వితరణ చేశారు. ఫ్రీజర్ బాక్స్ ను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు,గ్రామస్తులతో కలిసి గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి అందజేశారు.ఈ సందర్భంగా శిరీష ఫౌండేషన్ నిర్వాహకులు చెర్క కిరణ్ మాట్లాడుతూ మన గ్రామం కోసం ఏది అడిగినా అరక్షణం కూడా ఆలోచించకుండా సేవలందిస్తూన్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకరన్న గ్రామ ప్రజలందరూ ఎల్లప్పుడూ కృతజ్ఞతా భావంతో ఉంటారని తెలిపారు.ఫ్రీజర్ బాక్స్ ద్వారా గ్రామంలో మరణించిన ప్రతి నిరుపేద కుటుంబానికి పరోక్షంగా ఐదువేల రూపాయలను సహకరించినట్టేనని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాచకొండ రవి,శ్రీరాములు నర్సింహ్మ,పాశం కృష్ణ యాదవ్ గ్రామశాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం,లారీ బిక్షం,గుండమల్ల సతీష్ కుమార్, ఉప్పల శ్రీను,ఎడ్ల సత్తయ్య,రాసాల వేంకటేష్ ,చిలువేరు శంకర్,పేరా రమేష్,చిలువేరు వెంకులు, అబ్బనగోని వంశీ, బకారం శ్రీను,చింతకింది ఉషామ్మ,చిలువేరు శేఖర్,లింగస్వామి, పాత్రికేయులు సోమన బోయిన కృష్ణ కుమార్, శికిలమెట్ల ప్రభాకర్, చింతకింది సుధాకర్, పౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# జేపల్లిలో రేషన్ కార్డులపై క్షేత్రస్థాయి పరిశీలన..



వెలుతురు,చారకొండ 17 జనవరి:
మండలంలోని జేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దొంగలగుట్ట తాండ, నెమలిగుట్ట తాండ, జేపల్లి, దొడ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం కొత్త రేషన్ కార్డుల లబ్ధి దారుల ఎంపిక కోసం గ్రామ కార్య దర్శి మల్లేష్ యాదవ్ క్షేత్రస్థాయి ప రిశీలన నిర్వహించారు. కుల గణన సర్వే దరఖాస్తుల్లో భాగంగా కొత్తరేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పరిశీలించేందుకు ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్త రేషన్ కార్డు మంజూరుకు లబ్దిదారులు అర్హులా? కాదా అనే వివరాలను ఆయన పరిశీలించారు. లబ్దిదారుల కు సంబంధించిన వివరాలను కు టుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ లోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా అర్హుల జాబితాను సిద్ధం చేసేందుకు క్షేత్రస్థాయి పరిశీల న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనె ల 20 వరకు ఆయా గ్రామాల్లో క్షేత్ర పరిశీలన నిర్వహించి జాబితాను సిద్ధం చేసి 22వ తేదీన చేపట్టనున్న గ్రామసభల్లో జాబితాను ప్రవేశపెట్టి, అర్హుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. అదేవిధంగా రైతు భరోసా/ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేను గ్రామపంచాయతీ వ్యాప్తంగా వివిధ శాఖల అధికారులచే త్వరలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయకులు, గ్రామ పెద్దలు, యువత, పంచా యతీ సిబ్బంది, తదితరులు పాల్గొ న్నారు.

# రామన్నపేట పట్టణంలో ఎక్స్ప్రెస్ రైలు ఆగాలని కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన బిజెపి కార్యకర్తలు



రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 17
బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మరియు కేంద్ర మంత్రి వర్యులు జి కిషన్ రెడ్డి ని తమ నివాసంలో కలిసి రామన్నపేట పట్టణ కేంద్రంలో ఆపవలసిన నారాయణద్రి ఎక్స్ప్రెస్, ఫలక్నామ ఎక్స్ప్రెస్, కాచిగూడ, మిర్యాలగూడ డెమో, రైళ్లని ఆపకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వీటిని తక్షణమే పునరుద్ధరించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అందుకు వారు స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడి రామన్నపేటలో పలు రైళ్లను ఆపేందుకు కృషి చేస్తానని సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు పివి శ్యామ్ సుందర్ రావు మరియు నకిరేకల్ ఇంచార్జ్ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి, నార్కట్పల్లి మండల అధ్యక్షుడు శంకర్, వెంకటేశం తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా కల్వకుర్తిలో నేడు మెగా రక్తదాన శిబిరం

- ఉత్సాహవంతులైన పార్టీ నాయ కులు, యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదా నం చేయాలి
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు పవన్ నాయక్ విజ్ఞప్తి...

**వెలుతురు, చారకొండ 17,జనవరి :**



కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో నేడు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా రక్త దాన శిబిరం నిర్వహించనున్నారు. ఉత్సాహవంతులైన యువతీ, యు వకులు పార్టీ నాయకులు, కార్యకర్త లు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదా నం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు పవన్ నాయక్ శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవగా, పార్టీ సీని యర్ నాయకులు పెద్ద ఎత్తున హా జరవుతారని తెలిపారు.

## విశాఖ ఉక్కు హామీని నిలబెట్టుకున్న కేంద్రం

(మొదటి పేజీ తరువాయి..)

మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరఫున ధన్యావాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీపై రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి ఉత్పాదనతో లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఇకపోతే ప్రైవేటీకరన అంటూ సాగిన ప్రచారానికి తెరపడింది. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరులూదింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కర్మాగారాన్ని పునరుజ్జీవింపజేయడానికి ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్యాకేజీకి గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 'ఇది భారీ రివైవల్ ప్యాకేజీ. స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కు..పోర్టు ఆధారిత స్టీల్ ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణం అమల్లోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి ఆగస్టు నాటికి 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి వస్తాయి. ముడి సరకు సరఫరా కోసం ఎన్ఎండీసీతో చర్చిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలక పాత్ర పోషిస్తుంది. దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌ది కీలక పాత్ర. స్టీల్ ఎ÷-లాంట్ యాజమాన్యం, కార్మికులకు శుభాకాంక్షలు' అని అశ్వినీవైష్ణవ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టిన రోజు నుంచి విశాఖ ఉక్కుపై ప్రత్యేక దృష్టి సారించారు. దిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిలతో సమావేశమై కర్మాగారం పునరుజ్జీవంపై చర్చలు జరుపుతూ ఉన్నారు. ఇటీవల ప్రధానిని మరోమారు కలిసి విశాఖ ఉక్కుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనిపై విభిన్న కోణాల్లో చర్చించిన అనంతరం కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖ ఉక్కు కర్మాగారం 2023-24లో రూ.4,848.86 కోట్లు, 2022-23లో రూ.2,858.74 కోట్ల నష్టాన్ని మూటగట్టుకొంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో స్టీల్ ఎ÷-లాంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఎ÷-లాంటును సందర్శించారు. ఎ÷-లాంటు నిలదొక్కుకోవడానికి రూ.18 వేల కోట్లు అవసరమని విశాఖ ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నేతలు ఆయనకు విన్నవించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే కేంద్ర ఉక్కుశాఖ ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద.. జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరకుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్ల చొప్పున రెండు విడతల్లో సాయం చేసింది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పుల భారం, తగినంత ముడిసరకు లేకపోవడం, కోర్టు ఎటాచ్‌మెంట్లు, ఇన్‌సాల్వెన్సీ ప్రొసీడింగ్స్‌తో విశాఖ ఉక్కు కర్మాగారం తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. వీటిని తీర్చడంతోపాటు భవిష్యత్తులో తలెత్తే కష్టాల నుంచి తప్పించడానికి ఒక సమగ్ర ప్రణాళికను తయారు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇదివరకే పార్లమెంటు స్థాయీసంఘానికి చెప్పింది. దానిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆ సంఘం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సిఫార్సు చేసింది. దాని ప్రకారమే కేంద్ర ప్రభుత్వం ఈ ప్యాకేజీకి ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది.

## సైఫ్‌పై దాడిలో క్రిమినల్ గ్యాంగు ప్రమేయం

- అలాంటిదేమీ లేదని తోసిపుచ్చిన మంత్రి

**ముంబై,జనవరి17( వెలుతురు):**

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పై దుండగుడి దాడి ఘటనతో ముంబయి నగరం మరోసారి ఉలిక్కిపడింది. గతంలో ప్రముఖులపై మాఫియా గ్యాంగ్‌లు దాడులకు పాల్పడిన ఘటనలను గుర్తుచేసింది. అయితే, సైఫ్ దాడి వెనుక చోరీ ఉద్దేశం మాత్రమే కనిపిస్తోందని మహారాష్ట్ర హోంశాఖ సహాయ మంత్రి యోగేశ్ కదమ్ పేర్కొన్నారు. దీనిలో క్రిమినల్ గ్యాంగ్‌ల ప్రమేయాన్ని తోసిపుచ్చారు.'సైఫ్‌పై దాడి చేసినట్లుగా భావించి ఓ అనుమానితుడి ముంబయి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీటీవీలో కనిపించిన వ్యక్తి ముఖానికి దగ్గర పోలికలు ఉన్న ఈ యువకుడికి నేర చరిత్ర ఉంది. అయితే, ఈ ఘటనతో అతడికి సంబంధం లేదని గుర్తించాం. కేసు దర్యాప్తు కొనసాగుతోంది' అని మహారాష్ట్ర మంత్రి యోగేశ్ కదమ్ పుణెలో విలేకరులతో పేర్కొన్నారు. మరో వ్యక్తిని కూడా పోలీసులు ట్రాక్ చేస్తున్నారని చెప్పారు. దాడిలో ఘటనలో క్రిమినల్ గ్యాంగ్‌ల ప్రమేయంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. అటువంటి కోణం లేదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని మంత్రి పేర్కొన్నారు. కేవలం చోరీ కోసమే నిందితుడు వచ్చినట్లు ఇప్పటివరకు తెలిసిందన్నారు. ఏదైనా బెదిరింపు వచ్చినట్లు సైఫ్ నుంచి పోలీసులకు ఇప్పటివరకు ఎటువంటి సమాచారం లేదని, సెక్యూరిటీని కూడా కోరలేదని చెప్పారు. ఒకవేళ భద్రతను కోరితే నిబంధనల ప్రకారం కల్పిస్తామన్నారు.సైఫ్ శరీరం నుంచి పదునైన వస్తువును బయటకు తీసినట్లు లీలావతి ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఆయన వెన్నెముకకు ఎటువంటి ప్రమాదం లేదన్నారు. ఐసీయూ నుంచి ప్రత్యేక రూమ్‌కు తరలిస్తామని.. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని చెప్పారు. మరో రెండు, మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం

- సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కప్పల రవి కుమార్ గౌడ్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 17**



యాదాద్రి జిల్లా కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ టెంపుల్ పక్కన ఫంక్షన్ హాల్ నందు ఈనెల 24వ తేదీన శుక్రవారం రోజున సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరుగుతుంది. కావున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడ సోదరులు అన్ని సంఘాలకు సంబంధించిన గౌడ సోదరులు లక్షలాదిగా తరలిరావాలని యాదాద్రి జిల్లా అధ్యక్షులు కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల) పత్రికా ప్రకటనలు తెలిపినారు. ఈ కార్యక్రమానికి యాదాద్రి జిల్లా అధ్యక్షులు నల్గొండ జిల్లా అధ్యక్షులు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు జనగం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మహిళా అధ్యక్షులు విచ్చేయుచున్నారు. యూత్ అధ్యక్షులు పూర్తి రాష్ట్రస్థాయి కమిటీ సభ్యులు సమావేశానికి హాజరు అవుతున్నారు మనందరం కార్మికుల కోసం ఈ పోరాటం చేస్తున్నాము. ఎన్ని సంఘాలు ఉన్నా కార్మికుల కోసం ముందుండి పోరాటం చేసే సంఘానికి మద్దతు ఇవ్వాలని అన్ని సంఘాలు చేసేది కూడా కులం కోసం మాత్రమే అందరూ ఒకరికి ఒకరు సహకరించుకోవాలి, అదేవిధంగా అన్ని జిల్లాల అన్ని మండలాల కమిటీలు వేసుకొని కార్యవర్గాన్ని ముందుకు నడపాలని, ఈ మీటింగ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల) అధ్యక్షతన జరుగుతున్నది ప్రధాన కార్యదర్శి గుండాల యాదయ్య. గౌడ్ ఉపాధ్యక్షులు గంగాపురం యాదయ్య గౌడ్ మొరిగాని శ్రీను గౌడ్ ఆధ్వర్యంలో నడుస్తుంది. యాదాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల మల్లేష్ గౌడ్ వీరి ఆధ్వర్యంలో అధ్యక్షతన జరుగుతున్న కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా జనగాం రవీందర్ గౌడ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి మారగోని రమేష్ గౌడ్ అధ్యక్షులు నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు కొంపల్లి శ్రీనివాస్ గౌడ్. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కాసుల సత్యనారాయణ గౌడ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వెంకన్న గౌడ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నాగరాజ్ గౌడ్ మహిళా అధ్యక్షురాలు సూర్యాపేట జిల్లా గిలకత్తుల నాగమణి గౌడ్. ప్రధాన కార్యదర్శి నవ్య గౌరవ అధ్యక్షురాలు సూర్యాపేట జిల్లా అంజవ్వ యూత్ ప్రెసిడెంట్ పులుసు నరహరి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర సాంస్కృతిక చైర్మన్ గిల కత్తుల రమేష్ గౌడ్ మహేష్ గౌడ్, వినయ్ గౌడ్ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి వడ్లకొండ వెంకన్న గౌడ్. ప్రధాన కార్యదర్శి సాయిబాబాగౌడ్ తుంగతుర్తి అధ్యక్షులు బింకి రాజశేఖర్ గౌడ్. మరియు శాలిగౌరారం కార్యవర్గ సభ్యులు పూర్తిస్థాయిలో హాజరవుతున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనేసి కోరుతూ మీ కప్పల రవికుమార్ గౌడ్ పరిటాల.

# రేషన్ కార్డులు ఎంపిక విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

- అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి
- గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డులు ఇవ్వకాలేదు
- రాచకొండ లింగస్వామి ఐఎన్టీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 17:**



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకొని రేషన్ కార్డు,ఇందిరమ్మ భరోసా పథకాల జనవరి 26న ఇవ్వబోతున్నారు.రేషన్ కార్డులు కావాలని అప్లికేషన్ పెట్టుకున్న వారికి అధికారులు నిర్లక్ష్య చేసినట్టు కనిపిస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ప్రజా పాలన దరఖాస్తుల పేరుతో తీసుకున్నరు.అందులో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులు సగానికి పైగా బడుగు,బలహీన వర్గాల వారు ఉన్నారు.రెండు రోజులుగా గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు రేషన్ కార్డుల అర్హులు జాబితాలు పట్టుకొని ఇల్లిల్లూ తిరుగుతున్నారు. వారు ప్రకటించిన జాబితాలో వారి పేర్లు లేకపోవడం చాలా విచారించదగ్గ విషయమని ఐఎన్టియుసి జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ లింగస్వామి అన్నారు. నారాయణపురం మండలం కొత్తగూడెం గ్రామపంచాయతీలో సుమారు 150 మంది రేషన్ కార్డులు కావాలని దరఖాస్తు చేసుకున్నారు.కానీ అధికారులు 35 మందికి రేషన్ కార్డ్ అర్హుల జాబితలతో ఎంక్వయిరీ కోసం గ్రామంలో పరిశీలిస్తున్నారు.అర్హులైన మిగిలిన దరఖాస్తుదారులు ఈ జాబితాలో లేకపోవడంతో చాలా అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల ఎంపీడీవో ని ప్రశ్నించగా రెండో విడతలో అప్లికేషన్ చేసుకోవచ్చు అని చెప్తున్నారు. కానీ గత పది సంవత్సరాల నుంచి పెళ్లి చేసుకున్న జంటలు ఈసారి కూడా రేషన్ కార్డులు రాకపోతే మళ్లీ ఎప్పుడు వస్తాయని ఆందోళన చెందుతున్నారని దయచేసి స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంపై దృష్టి పెట్టాలని అర్హత కలిగిన పేదలకు రేషన్ కార్డులు వచ్చేలా అధికారులను ఆదేశించాలని వారు కోరారు.

# జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 17:**



కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి మీడియా సమావేశంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు,తెలంగాణ ప్రజలకు కొన్ని అంశాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నమనీ తెలిపారు, 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని మంత్రి ప్రభాకర్ తెలిపారు,ఇప్పుడు పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదు,గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా ,కొత్తగా పెళ్లి అయిన వారికి,కొత్త కుటుంబాలు , మార్పులు చేర్పులు ,అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి శుభవార్త అని మంత్రి ప్రభాకర్ అన్నారు,వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులను ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు, ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు.రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారికి , ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చునని మంత్రి స్పష్టం చేశారు,పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు. ఇందులో ఎలాంటి కన్ఫ్యూజన్ లేదు.ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే దానిని నమ్మవద్దని మంత్రి ప్రభాకర్ అన్నారు,కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ ల సమాచారం ఆధారంగా కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయని చెప్పారు, ఇందుర్తీ లో 71 కొత్త రేషన్ కార్డులు వచ్చాయని అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయని మంత్రి తెలిపారు,2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశామని ,రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం.వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నా మన్నారు, భూమి లేని రైతు కూలీలకు 12 వేలు ఇస్తున్నామని చెప్పారు,అలాగే ఇంధుర్తి మండల ప్రతిపాదనలు పంపాం.రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు,

# చెస్ ప్రపంచ చాంపియన్ ఖేల్ రత్న అవార్డు గ్రహీత గుకేష్ ని కలిసిన అనూప్ కుమార్

**కరీంనగర్ వెలుతురు జనవరి 17:**





చెస్ క్రీడలో ప్రపంచ చాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్న దొమ్మరాజు గుకేష్, భారత మహిళల నెంబర్ వన్ క్రీడాకారిణి కోనేరు హంపిలను కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్, కోచ్, ఇంటిగ్రేటెడ్ చెస్ జిల్లా కార్యదర్శి కంకటి అనూప్ కుమార్ మర్యాదపూర్వకంగా ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా అనూప్ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. వెంకటేశ్వరుని ప్రతిమలను జ్ఞాపికలుగా అందించారు. ఈ సందర్భంగా అనూప్ కుమార్ మాట్లాడు తూ ప్రపంచవ్యాప్తంగా చెస్ క్రీడను శాసించే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. గుకేష్, హంపి, అర్జున్, ప్రజ్ఞనంద, విశ్వనాథన్ ఆనంద్ ల స్ఫూర్తితో చెస్ క్రీడ క్రేజీ క్రీడగా మారిందన్నారు. వీరందరి స్ఫూర్తితో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చెస్ క్రీడకు విశేష ఆదరణ వచ్చిందన్నారు. భవిష్యత్తులో వీరందరి స్ఫూర్తితో చెస్ మెగా టోర్నిని నిర్వహించనున్నట్లు తెలిపారు.

# బ్రిజేష్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

- ఇది ముమ్మాటికీ నాటి కెసిఆర్ ప్రభుత్వ విజయం
- ప్రకటనలో వెల్లడించిన మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్,జనవరి17( వెలుతురు):**
కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు.. ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వ విజయమే అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి నుంచి సెక్షన్ 3 ప్రకారం నీళ్లు కేటాయించాలని కేసీఆర్ పట్టుబట్టారని పేర్కొన్నారు. తాజాగా ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని హరీష్ రావు తన ప్రకటనలో తెలిపారు. దీన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. అసలు ఏపీ పునర్విభజన చట్టం, సెక్షన్ 89 తెచ్చిందే కేంద్రంలోని కాంగ్రెస్ సర్కార్ అని గుర్తు చేశారు హరీష్ రావు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందే కాంగ్రెస్ అని విమర్శించారు. ఆ తప్పిదాన్ని సరిదిద్దేందుకు బీఆర్ఎస్‌కు పదేళ్ల కాలం పట్టిందన్నారు. కృష్ణా నదిలో న్యాయమైన వాటా దక్కే వరకు బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని హరీష్ రావు మరోసారి స్పష్టం చేశారు.కృష్ణా జలాల వివాదంపై బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కీలక ఉత్తర్వులిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2023లో అంతర్రాష్ట్ర జల వివాద చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం జారీ చేసిన తదుపరి టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌పై మొదట రెండు రాష్ట్రాల వాదనలు వినాలని ట్రిబ్యునల్ నిర్ణయించింది. దీనిపై వాదనలు పూర్తయిన తరువాత ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం తుది వాదనలు వింటామని ట్రిబ్యునల్ ధర్మాసనం పేర్కొంది. తదుపరి వాదనలను ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నాయి. ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నీటిలో ఎవరి వాటా ఎంత అన్నదానిపై వాదనలు విన్న తర్వాతే ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపుల అంశాన్ని ట్రిబ్యునల్ చేపట్టనుంది.

# మాజీమంత్రి పొన్నాల నివాసంలో చోరీ

**ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన**

**హైదరాబాద్,జనవరి17( వెలుతురు):**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఫిలింనగర్‌లోని పొన్నాల ఇంట్లో లక్షన్నర నగదుతో పాటు భారీగా అభరణాలు అపహరణకు గురయ్యాయి. పొన్నాల సతీమణి అరుణా దేవి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. పొన్నాల ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అయితే ఈ చోరీ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.సంఘటన జరిగిన సమయంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, కుటుంబసభ్యులు ఎవరూ ఇంట్లో లేదని తెలుస్తోంది. దొంగతనం జరిగిన రోజున పొన్నాల జనగాం జిల్లాలో ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటనపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# మంచు బ్రదర్స్ ట్వీట్ వార్



**హైదరాబాద్,జనవరి17( వెలుతురు):**
మంచు బ్రదర్స్ మరోసారి మీడియాకెక్కారు. సోషల్ మీడియా వేదికగా ఒకరినొకరు తిట్టుకున్నారు. ముందుగా మంచు విష్ణు ఎక్స్(ట్విట్టర్)లో ఓ సినిమా డైలాగ్ ను ట్వీట్ చేశాడు. పరోక్షంగా తననే అన్నట్లు భావించిన మనోజ్.. వెంటనే ఎక్స్ లో మరో కౌంటర్ ట్వీట్ పడేశాడు. అసలు వీరిద్దరు ఎక్స్ వేదికగా ఏమని తిట్టుకున్నారో చూద్దాం..ముందుగా ట్వీట్ వార్ ను మంచు విష్ణు స్టార్ట్ చేశాడు. 'సింహం అవ్వాలని ప్రతి కుక్కకు ఉంటుంది.. కానీ వీధిలో మొరగటానికి, అడవిలో గర్జించడానికి ఉన్న తేడా కనీసం వచ్చే జన్మలోనైనా తెలుసుకుంటావు' అని తన తండ్రి 'రౌడీ' సినిమాలోని డైలాగ్ ను ట్వీట్ చేశాడు. సోషల్ మీడియా లో ఈ ట్వీట్ మంచు మనోజ్ ను ఉద్దేశించే విష్ణు చేశాడని చర్చ జరుగుతోంది. విష్ణు ట్వీట్ చేసిన కాసేపటికే మనోజ్ మరో ట్వీట్ చేయడం సోషల్ మీడయాలో హీట్ పెంచింది. 'కన్నప్పలో రెబల్ స్టార్ కృష్ణం రాజు గారి లాగా సింహం అవ్వాలని ప్రతి ఫ్రాడ్ కుక్కకి ఉంటుంది, ఈ విషయం నువ్వు ఇదే జన్మలో తెలుసుకుంటావ్' అని మనోజ్ కౌంటర్ ట్వీట్ పోస్ట్ చేశాడు.

# నకిలీ ఇన్సూరెన్స్ ముఠా అరెస్ట్

**హైదరాబాద్,జనవరి17( వెలుతురు):**
శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ ఇన్సూరెన్స్ లు తయారుచేస్తున్న ముఠా సభ్యులను ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠా సభ్యులు విస్తృతంగా నకిలీ ఇన్సూరెన్స్ పాలసీలు తయారుచేసి అవి సరైన ధృవీకరణ లేకుండా అమాయకులకు విక్రయించి, భారీ మొత్తంలో దోచుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఓటి పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ కేసులో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పలువురు వ్యక్తుల నుంచి అనుమానాస్పద ఫిర్యాదులు అందిన తర్వాత వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎస్ఓటీ పోలీసులు ముఠా సభ్యులను కస్టడీలోకి తీసుకుని, వారి నుంచి కీలక సమాచారం సేకరించారు. ఈ ముఠా సభ్యులు నకిలీ ఇన్సూరెన్స్ పాలసీలను తయారు చేయడానికి ఆధునిక ప్రింటింగ్ మెషిన్లను ఉపయోగించి, ఉత్పత్తి చేశారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలను కూడా తయారుచేసి, వాటిని నిజమైన ఇన్సూరెన్స్ సంస్థల పత్రాల మాదిరిగా రూపకల్పన చేశారు. ఆ తరువాత వీరు ఆ పత్రాలను వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ విక్రయించారు. ఆ క్రమంలో నకిలీ ఇన్సూరెన్స్ లను సేల్ చేసేందుకు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసేందుకు వారు డోర్ టూ డోర్ సర్వీసులను కూడా నిర్వహించారు.

# కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసు

- పది ప్రత్యేక బృందాలతో పలుచోట్ల గాలింపు
- బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా గుర్తింపు




**హైదరాబాద్,జనవరి17( వెలుతురు):**
కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పది ప్రత్యేక బృందాలతో హైదరాబాద్ సహా రాయ్‌పుర్, బిహార్‌తో పాటు అనుమానిత ప్రాంతాల్లో పోలీసుల గాలింపు కొనసాగుతోంది. కాల్పులు జరిపింది బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. బీదర్‌లో దోపిడీకి పాల్పడి అక్కడ ఇద్దరిపై కాల్పులు జరిపి.. నగరంలోకి ప్రవేశించి ఇక్కడ నుంచి రాయ్‌పుర్ మీదుగా పారిపోవాలని ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. దొంగలు హైదరాబాద్‌కు ఎలా చేరుకున్నారనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. కాల్పులు జరిపిన ముఠా బిహార్ పారిపోయిందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ముఠాలో ప్రధానంగా అమిత్‌కుమార్ కీలకంగా ఉన్నట్టు.. అతనిపై బిహార్‌లో దోపిడీ, దొంగతనం వంటి పలు కేసులు ఉన్నట్టు గుర్తించారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగం పోలీసులు నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నారు. బిహార్ పోలీసులను సంప్రదించిన నగర పోలీసు ఉన్నతాధికారులు అమిత్‌కుమార్ నేరాల చిట్టా గురించి ఇప్పటికే తెలుసుకున్నట్టు సమాచారం. అమిత్ ముఠా కర్ణాటకలోని బీదర్, ఆ తర్వాత హైదరాబాద్‌లో కాల్పులతో బీభత్సం సృష్టించారు. బీదర్‌లో ఏటీఎంలో డబ్బులు నింపేందుకు వచ్చిన ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు జరిపి నగదుతో ద్విచక్ర వాహనంపై పరారై హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. అఫ్జల్‌గంజ్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో రాయ్‌పుర్ వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ట్రావెల్స్ సిబ్బంది బ్యాగులు తనిఖీ చేయడం, కట్టలకొద్దీ డబ్బును చూసి అనుమానంతో ప్రశ్నించడంతో నిందితులు ఒకరిపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి పరారయ్యారు. బీదర్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

హైదరాబాద్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సినీఫక్కీలో జరిగిన ఈ ఘటనలతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. రెండు చోట్లా అత్యంత రద్దీ ప్రదేశాల్లో ఆగంతుకులు ఇంతటి తెగింపు ప్రదర్శించడం గమనార్హం. బీదర్‌లో కాల్పులు జరిపింది బీహార్ ముఠాగా గుర్తించారు. వారం రోజుల క్రితం ఛత్తీస్‌ఘడ్ దోపిడీకి పాల్పడిన బీహార్ ముఠా.. హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్.. అక్కడ నుంచి బీహార్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. బీదర్‌లో రెండు రోజులుగా రెక్కీ చేసి మరీ అమిత్ కుమార్ ముఠా దోపిడీ చేసింది. అనంతరం బీదర్‌లో దోపిడీ చేసిన నగదును హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఇక్కడ రెండు బ్యాగ్‌లను కొనుగోలు చేసిన ముఠా.. అఫ్జల్‌గంజ్‌లో కొనుగోలు చేసిన బ్యాగ్‌లలోకి డబ్బులు నింపి అనంతరం పరారయ్యారు. పలు దోపిడీ కేసులో అమిత్ కుమార్ కీలక నిందితుడుగా ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పోలీసులతో బీదర్ పోలీసులు కలిసి రాయ్‌పూర్ వెళ్లారు. రాయ్‌పూర్, బీహార్‌లో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి దుండగులను పట్టుకుందనేందుకు యత్నిస్తున్నారు. కాల్పుల ఘటనలో నిందితులను పట్టుకునేందుకు మొత్తం 10 టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సిటీ శివారులు అన్ని ప్రాంతాల్లో గాలిస్తున్నామన్నారు. ఇద్దరి కదలికలు అనుమానంగా ఉండటంతో డ్రగ్స్, గంజాయి ఏమైనా తరలిస్తున్నారా అనే అనుమానంతో ట్రావెల్స్ సిబ్బంది జహంగీర్ బ్యాగ్‌లు తనిఖీ చేయాలని పట్టుబట్టాడని తెలిపారు. అందులో డబ్బు ఉండటంతో హవాలా డబ్బుగా అనుమానించిన జహంగీర్ పోలీసలకు చెప్తాను అని అన్నాడని.. దీంతో వెంటనే దండుగులు అతనిపై కాల్పులు జరిపినట్లు చెప్పారు. అనంతరం అక్కడి నుంచి ఆటోలో పారిపోయారని.. ట్యాంక్ బండ్ వరకు వెళ్ళారన్నారు. అక్కడి నుంచి బీహార్ వెళ్ళి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడించారు.

# మంత్రివర్గంలో జిల్లాకు దక్కని ప్రాతినిధ్యం

- కడప జిల్లాపై ప్రభుత్వం శీతకన్ను
- ఏడు నెలలైనా అభివృద్ధి శూన్యం
- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి



**కడప,జనవరి17( వెలుతురు):**
కడప జిల్లాపై కూటమి ముఖ్య మంత్రి చంద్రబాబు కక్ష కట్టడం దురదృష్టకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు 7 అసెంబ్లీ స్థానాలకు గాను 5 స్థానాలలో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం కడప జిల్లాకు అన్యాయం చేస్తునే ఉంది. శుక్రవారం వేంప్లలెలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి 7 నెలలు అయ్యింది. ఈ ఏడు నెలల కాలంలో జిల్లాకు అనేక అన్యాయాలు జరిగాయి. రాష్ట్ర మంత్రివర్గంలో జిల్లాకు ప్రాతినిధ్యం లేదు. గతంలో జిల్లా నుంచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించేవారు. ప్రస్తుతం ఒక్క మంత్రి కూడా జిల్లా నుండి లేక పోవడం శోచనీయం. రాష్ట్ర ప్రభుత్వం రెండు దఫాలుగా నామినేటెడ్ పదవుల జాబితా ప్రకటించింది. అందులో కడప జిల్లా నుంచి ఒక్కరికి కూడా ఒక్క చైర్మన్ పదవి ఇవ్వలేదు. పుష్పక విమానం లాంటి టిటిడి బోర్డులో కూడా కడప జిల్లా నుంచి ఒక్కరూ కూడా లేరు. శాంతి భద్రతల దృష్ట్యా కడప జిల్లా సున్నితమైన, కీలకమైన జిల్లా. గత రెండున్నర నెలలుగా ప్రభుత్వం కడపకు రెగ్యులర్ ఎస్పీని నియమించక పోవడం దారుణం. పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లా ఎస్పీనే ఇన్ ఛార్జ్ ఎస్పీగా ఉంచారు. కేంద్ర ప్రభుత్వం 2023 డిసెంబర్ 4న కొప్పర్తి పారిశ్రామిక వాడకు రూ. 250 కోట్లతో ఎంఎస్ ఎంఈ టెక్నాలజీ సెంటర్ ను మంజూరు చేసింది. దీన్ని కొప్పర్థి నుండి అమరావతికి తరలిస్తూ 2024 సెప్టెంబర్ 24న రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి 50 ఎంబిబిఎస్ సీట్లు కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ 2024 ఆగస్టు 16న లెటర్ ఆఫ్ ప్రామిస్ ఇచ్చింది. తాము నిర్వహించలేక వసతి సౌకర్యం లేదని, ఫ్యాకల్టీ లేదు, ఆ సీట్లు మాకు వద్దని రాష్ట్ర ప్రభుత్వం 2024 సెప్టెంబర్ 9న జాతీయ మెడికల్ కమిషన్ కు లేఖ వ్రాయడం విడ్డూరంగా ఉంది. లేఖ రాయడం వలన మెడికల్ కళాశాలకు 50 సీట్లు రాకుండా పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేయని కారణంగా కడప ? రాయచోటి ? మదనపల్లి ? బెంగుళూరు నూతన బ్రాడ్ గెజ్ పనులు మధ్యలో నిలిచి పోయాయి.. రోడ్డు విస్తరణ పేరుతో 4 సంవత్సరాల క్రిందట వేంప్లలె ? రాయచోటి రోడ్డును త్రవ్వి వదిలి పెట్టడం జరిగిందని, వాటిపై దృష్టి పెట్టలేదని ఆయన చెప్పారు. కడప ? రాజంపేట ? కోడూరు ? రేణిగుంట జాతీయ రహదారి టెండర్లు అయిపోయి 15 నెలలైనా పనులు మొదలు పెట్టలేదన్నారు. ఈ మార్గంలో రద్దీ ఎక్కువ కావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు చెప్పారు. విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ఎ÷-లాంట్ నిర్మాణం జరగలేదని వాటి ఊసే లేదన్నారు. ముఖ్యమంత్రి కడప జిల్లాకు వస్తున్న సందర్భంగా కడప జిల్లాకు చెందిన సమస్యలపై దృష్టి సారించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువ కుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, సుబ్బ రాయుడు, వెంకటేష్, రమణ, మహబూబ్ బాషా, వేమా రాజా, వేమయ్య, బద్రి, రవి,మదార్ పాల్గొన్నారు.

# నేరేడ్‌మెట్ పరిధిలో డ్రగ్స్ స్వాధీనం

- నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారుగా గుర్తింపు
- రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వెల్లడి

**హైదరాబాద్,జనవరి17( వెలుతురు):**
నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మీడియాకు రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వివరాలు తెలిపారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన మహేష్, మహిపాల్‌గా గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అధిక ధరలకు నిందితులు హెరాయిన్ విక్రయిస్తున్నారని అన్నారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారైనా నేరేడ్‌మెట్ పరిధిలో స్థిరపడ్డారని అన్నారు. వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో వివిధ పద్ధతులు వాడుతున్నారన్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్యాస్ రిపేర్‌కు సంబంధించిన పరికరాల్లో ప్యాక్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు. గ్యాస్ సిలిండర్ వాల్వ్‌లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. అనుమానం రాకుండా ఇలాంటి టెక్నిక్స్ వాడుతున్నారని చెప్పారు. ఓలా, ఊబర్, రాపిడో సహా ఇతర మార్గాల ద్వారా వీటిని కస్టమర్లకు చేరవేస్తున్నారన్నారు. 200 గ్రాముల హెరాయిన్ లక్ష రూపాయలకు కొనుగోలు చేసి... దానిని దాదాపు రూ. 23 నుంచి 25 లక్షల వరకు విక్రయిస్తున్నారన్నారు. రాజస్థాన్‌కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిదిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు. పిల్లలు, యువత ఇలాంటి మత్తు పదార్థాలకు బలికావద్దంటే... ప్రజల సహకారం కూడా కావాలని చెప్పారు. డ్రగ్స్ సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని అన్నారు. వీటిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కళాశాలల్లోకి వెళ్లి యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నిన్న జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి తమ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు కూడా వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారని సీపీ సుధీర్ బాబు తెలిపారు.

# శ్రీవారి ఎప్రిల్ కోటా ఆర్జిత సేవలు

- నేడు ఆన్‌లైన్‌లో విడుదలకు ఏర్పాటు

**తిరుమల,జనవరి17( వెలుతురు):**
తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, అష్టాదళ పాదపద్మారాధన సేవకు సంబంధించి ఏప్రిల్ కోటా టికెట్లను జనవరి 18న ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. ఈ- టికెట్ల కోసం జనవరి 18 నుంచి 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపింది. ఈ-టికెట్లు పొందిన వారు జనవరి 20 నుంచి 22న మధ్యాహ్నం 12 గంటల్లోగా సొమ్ము చెల్లిస్తే.. వారికి లక్కీడిప్‌లో టికెట్లు కేటాయించనున్నట్లు తెలిపింది. ఏప్రిల్ 10 నుంచి 12 వరకు నిర్వహించనున్న స్వామివారి సాలకట్ల వసంతోత్సవాలు, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలకు సంబంధించిన టికెట్లను జనవరి 21న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు తితిదే వెల్లడించింది. వర్చువల్ సేవలు, దర్శన స్లాట్ల కేటాయింపునకు సంబంధించి ఏప్రిల్ కోటాను జనవరి 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు పేర్కొంది.




# కృష్ణాజలాలపై కెసిఆర్ పోరు ఫలించింది: కవిత

**హైదరాబాద్,జనవరి17( వెలుతురు):** బీడుబడ్డ తెలంగాణ భూములకు కృష్ణా జలాలను మళ్లించాలని ఉద్యమ నేత కెసిఆర్ చేసిన కృషి ఫలించిందని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో వాటాపై ట్రిబ్యునల్ ఉత్తర్వులపై ఎంఎల్‌సి కవిత ఎక్స్ వేదికగా స్పందించారు. కృష్ణా నీళ్లలో మా వాటా మాకే అని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చేసిన పోరాట ఫలాలు అందుకోవడం ఎంతో దూరంలో లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపై విచారణ జరపాలని గత పదేళ్లుగా కెసిఆర్ చేసిన వాదనకే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మొగ్గు చూపడం సంతోషకరమని అన్నారు. ఇది బిఆర్ఎస్ పార్టీ విజయం?తెలంగాణ ప్రజల విజయం అంటూ ట్వీట్ చేశారు.

## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు

- అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష



**లాహోర్,జనవరి17( వెలుతురు):**
పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్, ఆయన సతీమణి బుష్రా బీబీ దోషులుగా తేలారు. ఆయనకు 14 ఏళ్ల జైలు శిక్ష పడగా.. ఆమెకు ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అడియాలా జైలులో కట్టుదిట్టమైన భద్రత నడుమ న్యాయమూర్తి తుదితీర్పు చదివి వినిపించారు. ఇమ్రాన్, బుష్రాలకు 10 లక్షలు, 5 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధించారు. ఇమ్రాన్ దంపతులతో పాటు మరో ఆరుగురిపైనా నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో 2023లో ఈ కేసు నమోదు చేసింది. లండన్‌లో ఉంటున్న పాక్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుసేన్ నుంచి వసూలుచేసిన 19 కోట్ల పౌండ్లను బ్రిటన్ పాక్‌కు పంపగా.. ఆ సొమ్మును ఇమ్రాన్ దంపతులు గోల్‌మాల్ చేశారని ఆరోపణ. దీన్ని అల్‌ఖాదిర్ ట్రస్టు కేసుగా వ్యవహరిస్తున్నారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు బ్రిటన్ నుంచి అందిన ఆ 19 కోట్ల పౌండ్లను జాతీయ ఖజానాలో జమ చేయకుండా, సుప్రీంకోర్టు గతంలో రియాజ్‌హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదులో నుంచి కట్టడానికి అనుమతించారని అభియోగం. దీనికి బదులుగా ఇమ్రాన్ దంపతుల ట్రస్టు నెలకొల్పదలచిన అల్‌ఖాదిర్ విశ్వవిద్యాలయానికి హుసేన్ 57 ఎకరాలను బహుమానంగా ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆగస్టు 2023 నుంచి ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితం గడుపుతున్నారు. ఆయనపై సుమారు 200కు పైగా కేసులు నమోదయ్యాయి. అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని, తనను అధికారానికి దూరంగా ఉంచేందుకు చేస్తోన్న కుట్ర అని మాజీ ప్రధాని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల తనపై ఉన్న జైలు శిక్ష సస్పెండ్ కావడంతో బుష్రాబీబీ ప్రస్తుతం బయటే ఉన్నారు. అయితే తాజా తీర్పు సందర్భంగా ఆమె కోర్టుకు వచ్చినట్లు తెలుస్తోంది.

## సెంటిమెంట్ దెబ్బ

- నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**ముంబై,జనవరి 17( వెలుతురు):**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. వరుసగా మూడు రోజుల పాటు లాభాలు చవిచూసిన సూచీలు.. ఐటీ, బ్యాంకింగ్ షేర్ల రూపంలో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. మరికొన్ని రోజుల్లో ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టనుండడం, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరుగుదల, విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండడం వంటివి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఓ దశలో సెన్సెక్స్ 700 పాయింట్ల మేర నష్టపోగా.. తర్వాత కాస్త కోలుకుంది. నిఫ్టీ 23,200 స్థాయికి చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,069.19 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,263.29 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 108.60 పాయింట్ల నష్టంతో 23,203.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.61 వద్ద ఎ÷-లాట్‌గా ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో గురువారం ఫలితాలు ప్రకటించిన ఇన్ఫోసిస్ అత్యధికంగా 6 శాతం మేర నష్టపోయింది. బలహీన త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన యాక్సిస్ బ్యాంక్ సైతం 5 శాతం మేర క్షీణించింది. దీని ప్రభావం ఇతర బ్యాంక్ షేర్లపైనా పడింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్ సైతం నష్టాల్లో ముగిశాయి. జొమాటో, రిలయన్స్, నెస్లే ఇండియా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 81 డాలర్ల ఎగువన ట్రేడవుతుండగా.. బంగారం సైతం 2730 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## రేవంత్ ప్రభుత్వ వేధింపులు ఎక్కువయ్యాయి

- మాసాబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ విచారణకు వచ్చిన కౌశిక్ రెడ్డి




**హైదరాబాద్,జనవరి 17( వెలుతురు):**
హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాసబ్ ట్యాంక్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. తన న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ విధులకు ఆటంకం కలిగించిన కేసులో కౌశిక్‌రెడ్డిని విచారించారు. గతేడాది డిసెంబర్ 4న ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు కౌశిక్‌రెడ్డి వెళ్లారు. సీఐ వాహనానికి తన వాహనం అడ్డుపెట్టి అనుచరులతో హల్‌చల్ చేశారు. దీంతో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. మాసబ్ ట్యాంక్‌లో విచారణ ముగిసిన అనంతరం కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏ విధంగా వేధిస్తుందో అందరూ గమనిస్తున్నారని విమర్శించారు. బాధ్యతగల పౌరుడిగా విచారణకు సహకరించేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చినట్లు చెప్పారు. 'గతంలో బంజారాహిల్స్‌లో పిటిషన్ ఇచ్చేందుకు సీఐ దగ్గరికి వెళ్తే ఆయన లేచి పరుగులు పెట్టబోయారు. బాధ్యత గల ఎమ్మెల్యేగా నేను స్టేషన్‌కు వెళ్లినప్పుడు సీఐగా ఆయన బయటికి పరుగులు పెట్టొచ్చా అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయానికి వచ్చినప్పుడు రిసీవ్ చేసుకోవాలా వద్దా? సీఐ బయటికి వెళ్తున్న క్రమంలో.. నేను పిటిషన్ ఇచ్చేందుకు వచ్చానని చెప్పాను. పిటిషన్ తీసుకొని వెళ్తే అయిపోతుంది కదా అన్నాను. పిటిషన్ ఇచ్చిన రెండు గంటల తర్వాత నాపై కేసులు నమోదు చేశారు. వందలాది మంది పోలీసులను మరుసటి రోజు నా ఇంటికి పంపించారు. డోర్లు పగులగొట్టి నా బెడ్‌రూమ్ దగ్గరికి వచ్చి అరెస్టు చేశారు. నా ఇంటి డోర్లు పగులగొట్టే హక్కు పోలీసులకు ఎవరు ఇచ్చారు? నా బెడ్‌రూమ్ దగ్గరికి వచ్చి అరెస్టు చేసేందుకు నేను క్రిమినల్‌నా?' అని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌కు భారీ ఆర్థిక చేయూత

- రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన కేంద్రం
- కేంద్రానికి కృతజ్ఞతలు చెబుతూ మంత్రి రామ్మోహన్ ట్వీట్



**న్యూఢిల్లీ,జనవరి 17( వెలుతురు):**
విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం శుభవార్త చెప్పింది. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారికంగా వెల్లడించారు. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ క్రమంలో స్టీల్ ప్లాంట్ ఆపరేషనల్ పేమెంట్స్ కోసం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించినందుకు గాను ప్రధాని మోదీకి ఎక్స్ వేదికగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు.'విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరి పోసేలా రివైవల్ ప్యాకేజీ కింద రూ.11,400 కోట్లు కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. నష్టాలను అధిగమించి, ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పాదనతో లాభాల బాట పెట్టేందుకు ఈసాయం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల ఎన్డీయే ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం' అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ట్వీట్ చేశారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి ఉత్పాదనతో లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు.

# నిషేధిత జాబితా నుంచి 7లక్షల ఎకరాల భూముల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి..)
భూములను ఏం చేయాలన్న దానిపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. వచ్చే కేబినెట్ భేటీలోపు భూముల అవకతవకలపై నివేదిక ఇవ్వాలని ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో నిషేధిత జాబితా నుంచి భారీగా భూములు తొలగించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అలాగే కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ధాన్యం కొనుగోలు కోసం 700 కోట్ల రూపాయల రుణం తీసుకునేందుకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ హామీ ప్రతిపాదనపై అనుమతి ఇచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగవ్యవస్థపై చర్చించనుంది. ఇక, 62 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సంబంధించి నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నాగావళి నదిపై గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ పై కుడి, ఎడమ వైపు మిని హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కడప జిల్లా సీకే దిన్నె మండలంలో ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ ఇన్ఫ్రా కార్పొరేషన్ కు కేటాయించిన 2,595 ఎకరాల బదిలీకి స్టాంపు డ్యూటీ మినహాయింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ప్రభుత్వ పథకాల అమలు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణ పనులు, పేదలకు భూమి పంపిణీ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. తల్లికి వందనం పథకం అమలు విషయంపై చర్చించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి తల్లికి వందనం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం డబ్బులు వేసిన వెంటనే.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నదాత సుఖీభవ వేయాలని నిర్ణయించారు. ఇక పోలవరం డయాఫ్రామ్ వాల్‌ను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. రాధాజాని అమరావతి పనులు కూడా వెంటనే ప్రారంభమవుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కేబినెట్ భేటీలో చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం పేదలకు



ఇచ్చేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బడ్జెట్ సమావేశాలకు ముందు కలెక్టర్ల సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇళ్ల స్థలాలకు పట్టణాల్లో స్థలం లేకపోతే ఇల్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇన్‌చార్జి మంత్రులు జిల్లాలో సమావేశం ఏర్పాటు చేసి స్థలాలు సేకరణపై నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అమరావతి, పోలవరం, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇవ్వడంపై కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇచ్చినా భవిష్యత్‌లో స్టీల్ ప్లాంట్ కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని కేబినెట్ భావించింది. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అనే సెంటిమెంట్ ఉందని, అందుకు అనుగుణంగా ప్లాంట్‌ను నడపాలని కేబినెట్ భావించింది. ఫ్రీ హోల్డ్‌లో ఉన్న 15 లక్షల 35 వేల ఎకరాల్లో 25 వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ అయిందని మంత్రి మనోహర్ చెప్పారు. రాష్ట్రానికి కేంద్రం ఎంతో సహాయం చేస్తుందని అందువలన.. మనం కూడా కేంద్రానికి అదేవిధంగా సహాయం చేయాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. శనివారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా వస్తున్నారని, ఆయనతో డిన్నర్ మీట్‌లో మూడు పార్టీల నేతలు కలుస్తారని సీఎం చెప్పారు. ఇకపోతే పలు నిరణయాల్లో..గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణకు ఆమోదం దక్కింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆర్‌టీజీఎస్ ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. తోటపల్లి బ్యారేజీపై మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణాలకు ఆమోదం ఇచ్చారు. కడప జిల్లా సీకేదిన్నెలో 2,595 ఎకరాల బదిలీకి స్టాంప్ డ్యూటీ మినహాయింపుకు ఆమోదం అభించింది. అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చారు. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనపై కేబినెట్ ఆమోదం. విద్యుత్ సుంకంలో టారిఫ్‌ల తగ్గింపును మార్చి వరకు పొడిగిస్తూ ఆమోదం ఇచ్చారు. 62 నియోజకవర్గాల్లో 63 అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ఆమోదం ఇచ్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభంలోనే పలు పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. కేబినెట్ భేటీ అనంతరం పలు రాజకీయ అంశాలపై చంద్రబాబు చర్చించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాల అమలుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణం, రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమవుతాయని సీఎం వెల్లడించారు.

# మాజీ సిఐడి చీఫ్ సునీల్ కుమార్ పై విచారణ

- అధారిటీని నియమించిన కూటమి ప్రభుత్వం

**అమరావతి,జనవరి17( వెలుతురు):**
పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ పై విచారణకు అధారిటీని ప్రభుత్వం నియమించింది. ఆయనపై గతంలో నమోదు అయిన అభియోగాలపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయన ఇచ్చిన వివరణను తిరస్కరించిన ప్రభుత్వం ఎంక్వయిరీకి కూటమి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. విచారణకు అథారిటీని వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అథారిటీలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తాలు ఉంటారు. సాధ్యమైనంత త్వరగా సునీల్ కుమార్‌పై ఉన్న అభియోగాలపై నివేదిక ఇవ్వాలని అధారిటీని ప్రభుత్వం ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన పీవీ సునీల్ కుమార్ వైఎస్‌ఆర్‌సీపీ హయాంలో సీఐడీ చీఫ్ గా ఉన్నారు. ఆ సమయంలో ఆయన చాలా అవకతవకలకు పాల్పడ్డారని .. వైసీపీ అధినేత కోసం టీడీపీ నేతల్ని తప్పుడు కేసులతో వేధించారన్న ఆరోపణలు ఎదుర్కొంటూ వచ్చారు. ముఖ్యంగా రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఆయనపై కేసు నమోదు అయింది. ఈ కేసు విషయంలో సోషల్ మీడియాలో చేసిన కామెంట్స్ కారణంగా ఆయనపై



క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆయనకు ఎక్కడా పోస్టింగ్ రాలేదు. రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో ఆయన కీలక పాత్రధారి అని ఫిర్యాదు దారు, డిప్యూటీ స్పీకర్ రఘురామ ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రఘురామ పై కస్టోడియల్ టార్చర్ కేసులో అరెస్టు అయిన మాజీ ఓఎస్డీ విజయ్ పాల్, కామేపల్లి తులసీబాబు అనే వ్యక్తులు ఇద్దరూ సునీల్ కు సన్నిహితులని చెబుతున్నారు. కామేపల్లి తులసిబాబు సీఐడీకి లీగల్ అడ్వయిజర్ గా..సునీల్ నియమించారని ఆయనను అడ్డం పెట్టుకుని దందాలు చేశారని అంటున్నారు. తనను అరెస్టు చేసిన రోజున సీఐడీ ఆఫీసులో తనపై కూర్చుని.. తనకు ఊపిరి ఆడకుండా చేసి చంపే ఎ÷-లాన్ చశారని దానికి పీవీ సునీలే కారణమని రఘురామ ఆరోపిస్తున్నారు. అదే సమయంలో తులసీబాబును అడ్డం పెట్టుకుని అగ్రిగోల్డ్ కు బాధితులకు అందాల్సిన సొమ్మును పక్కదోవ పట్టించి దోచుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశంపై ఇప్పటికే నివేదిక రెడీ అయినట్లుగా చెబుతున్నారు. అలాగే సునీల్ కుమార్ సర్వీసులో ఉంటూనే ఓ మతపరమైన సంస్థను నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన హిందుత్వంపై గతంలో చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్ అయింది. మత మార్పిళ్లకు పాల్పడుతున్నారని కొన్ని సంస్థలు కేంద్రానికి ఫిర్యాదు చేశాయి. పలుమార్లు కేంద్ర హోంశాఖ నుంచి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రానికి లేఖలు వచ్చాయి. ఓ సారి గట్టిగా హెచ్చరికలు రావడంతో ఆయనను సీఐడీ చీఫ్ పదవి నుంచి బదిరి చేసినట్లుగా చెబుతున్నారు. తాజాగా విచారణకు కమిటీ వేయడంతో చాలా విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

# మేనకోడలితో శారీరక సంబంధం

- బ్లాక్‌మెయిల్‌తో యువతి ఆత్మహత్య
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**బెంగళూరు,జనవరి 17( వెలుతురు):**
బెంగళూరులో దారుణం జరిగింది. ప్రైవేట్ ఫోటోలు, వీడియోలు లీక్ చేస్తానని సొంత మేనమామ బ్లాక్ మెయిల్ చేయడంతో సాఫ్ట్ వేర్ ఉద్యోగిని(24) హోటల్ గదిలోనే నిప్పంటించుకుంది. జనవరి 12న ఈ ఘటన జరగ్గా..16న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం..24 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుహాసి సింగ్.. ఆరేళ్లుగా ఆమె తన మామ(ప్రవీణ్), అత్తతో కలిసి ఐఖీ పురంలోని ÷ూ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది. కాలక్రమేణా సుహాసీ సింగ్ తన మేనమామ ప్రవీణ్ ఇద్దరూ తరచుగా కలిసి ప్రయాణించేవారు. ఈ క్రమంలో మేనమామ ప్రవీణ్ తో శారీరకంగా దగ్గరైంది. అయితే ఇద్దరు ఏకాంతంగా ఉన్న ప్పుడు ఆమెకు తెలియకుండా ప్రవీణ్ ఫోటోలు,వీడియోలు తీసి పెన్ డ్రైవ్ లో



సేవ్ చేశాడు. అయితే కొన్ని రోజుల తర్వాత సుహాసి సింగ్ ప్రవీణ్ ను దూరం పెట్టింది. సుహాసీ వేరే వ్యక్తితో క్లోజ్ గా ఉంటున్న విషయాన్ని ప్రవీణ్ తెలుసుకున్నారు.ఆమె వాట్సప్ లో చాటింగ్ కూడా చదివాడు. ఇవన్నీ తెలిసి కూడా తనతో సంబంధం కొనసాగించాలని తన మేనకోడలుసుహాసి సింగ్ పై ఒత్తిడి తెచ్చాడు. ఐటీపీఎల్ మెయిన్ రోడ్డులో తాను బుక్ చేసుకున్న హోటల్ గదిలో సుహాసిని కలవాలని డిమాండ్ చేశాడు. రాకపోతే తనతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు ,వీడియోలను తన ఆమె తల్లిదండ్రులకు పంపిస్తానని బెదిరించాడు. దీంతో సుహాసి ఒక బాటిల్ లో పెట్రోల్ తీసుకుని హోటల్ గదికి వెళ్లింది. శారీరకంగా కలవాలని ఒత్తిడి తేవడంతో హోటల్ గదిలోనే తనను తాను నిప్పంటించుకుంది. ప్రవీణ్ ఆమెను బాత్రూమ్‌కి తీసుకెళ్లి షవర్ ఆన్ చేసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు.. కానీ అప్పటికే సుహాసికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను విక్టోరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు జనవరి 12న రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందింది. నిందితుడు ప్రవీణ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి దగ్గరి నుంచి మొబైల్, పెన్ డ్రైవ్ ను స్వాధీనం చేసుకున్నామని వైట్‌ఫీల్డ్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ శివకుమార్ గునార్ తెలిపారు. హెచ్‌ఏఎల్ పోలీస్ స్టేషన్‌లో బీఎన్ఎస్ సెక్షన్ల కింద ప్రవీణ్ అతని భార్యపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని చెప్పారు పోలీసులు.

# స్థానిక ఎన్నికలపై నజర్

- **సంక్రాంతి పలకరింపులతో హల్‌చల్**

**నిజామాబాద్, జనవరి17( వెలుతురు):**

బీసీ గణనకు సంబంధించి కమిషన్ల రిపోర్టులు రాగానే రిజర్వేషన్లు పెంచి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత ఫిబ్రవరిలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా మాజీలయ్యారు. ఈనెలలో మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్ల టర్మ్ పూర్తికానుంది. దీంతో రూరల్, అర్బన్ లోకల్ బాడీలకు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా 15 గ్రామ పంచాయతీలు ఏర్పడడంతో జిల్లాలో పంచాయితీల సంఖ్య 545 పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో అప్పుడే స్థానిక హడావిడి మొదలయ్యింది. ముఖ్యంగా పంచాయితీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారంతా ఇప్పటి నుంచే గ్రామాల్లో కరచాలనాలు మొదలు పెట్టారు. పలకరింపులు చేస్తున్నారు. బాగున్నావా అని ఆత్మీయంగా చూస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఇదే సందడి కనిపించింది. వాడు సర్పంకు పోటీ చేస్తున్నాడనే కామెంట్స్ కూడా బాగానే వినిపించాయి. ఇకపోతే జిల్లాలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాన్సువాడ సెగ్మెంట్‌లోని కొన్ని మండలాలున్నాయి. తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రకటించారు. తాజాగా జిల్లాలో 14,35,214 మంది ఓటర్లుండగా పురుషులకన్నా 80,875 మంది మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్నట్టు లెక్క తేలింది. మహిళల తర్వాత యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారు 26 వేల వరకు ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువతీయువకులే దాదాపు సగం వరకు ఉన్నారు. కొత్త జాబితా ప్రకారం 18 నుంచి 39 ఏండ్ల మధ్య వయస్సున్న ఓటర్ల సంఖ్య 6, 96,014. దీంతో రానున్న లోకల్? బాడీ ఎన్నికల్లో మహిళలు, యువతే కీలకం కానున్నారు. దీంతో యువతలో కూడా సర్పంచ్ పదవులపై ఆశ కనిపిస్తోంది. పంచాయితీలతో పాటు వాటి పరిధిలోని 5,022 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్స్ లతో పాటు పేపర్ బ్యాలెట్ రెడీ చేశారు. జిల్లాలో 31 మండలాలున్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటిలోనూ యువత, మహిళలే నిర్ణేతలు కానున్నారు. వారు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే అందలమెక్కే చాన్సుఉందని అంటున్నారు.

# వైట్‌హైజ్ వద్ద ట్రక్కుతో దాడికి యత్నం

- **భారత సంతతికి చెందిన సాయి వర్షిత్‌కు 8 ఏళ్ల జైలు**





**వాషింగ్టన్, జనవరి17( వెలుతురు):**

అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్ద 2023లో భారత సంతతి యువకుడు ట్రక్కుతో దాడికి యత్నించిన ఘటన తీవ్ర కలకలం రేపిన ఘటనలో నిందితుడైన తెలుగు సంతతి వ్యక్తి 19 ఏళ్ల కందుల సాయి వర్షిత్ కు కోర్టు 8 ఏళ్ల జైలుశిక్ష విధించింది. వర్షిత్‌ను అప్పట్లోనే పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసులో అతడికి 8 ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు జడ్జి డాబ్నీ ఫ్రెడ్రిచ్ వెల్లడించారు. నాజీ భావజాలంతో వెళ్లి డెమోక్రటిక్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు యువకుడు యత్నించాడని పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాన్ని నాజీ భావజాలంతో కూలగొట్టాలనే ఉద్దేశంతో సాయివర్షిత్ ఈ దాడికి యత్నించాడు. అవసరమైతే అధ్యక్షుడిని కూడా చంపాలని తాను నిర్ణయించు కున్నట్లు అంగీకరించాడు. దీంతో అతడికి 8ఏళ్లు శిక్ష విధించాలని న్యాయస్థానం నిర్ణయించింది. అతడి చర్యల వల్ల ధ్వంసమైన నిర్మాణాల తొలగింపు, పునర్నిర్మాణం మొదలైన ఖర్చులతో కలిపి నేషనల్ పార్క్ సర్వీస్‌కు జాఆ 4,322 డాలర్ల (సుమారు రూ.3,74,000) నష్టం వాటిల్లిందని కోర్టు పేర్కొంది. కోర్టు పత్రాల ప్రకారం.. 2023 మే 22 సాయంత్రం మిస్సోరిలోని సెయింట్ లూయిస్ నుంచి సాయి వర్షిత్ వాషింగ్టన్ డీసీకి చేరుకున్నాడు. అక్కడ ఓ ట్రక్కును అద్దెకు తీసుకొని రాత్రి 9.35 గంటల ప్రాంతంలో వైట్‌హౌస్ వద్దకువెళ్లి సైడ్‌వాక్‌పై వాహనాన్ని నడిపాడు. పాదచారులు భయాందోళనకు గురై పరుగులు పెట్టారు. అనంతరం శ్వేతసౌధం ఉత్తరభాగం వైపు భద్రత నిమిత్తం ఏర్పాటుచేసిన ట్రాఫిక్ బారియర్స్‌ను ఢీకొట్టాడు. ఆ తర్వాత ట్రక్కును రివర్స్ చేసి మరోసారి ఢీకొట్టాడు. వాహనం నుంచి కిందకుదిగి నాజీ జెండాను పట్టుకొని నినాదాలు చేశాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. అధ్యక్షుడు జో బైడెను హత్య చేయాలనే లక్ష్యంతో ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి యత్నించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం అతడు ఆరు నెలలుగా ఎ÷–లాన్ చేసి మరీ ఈ ఘటనకు పాల్పడినట్లు తేలింది. ఈవిషయాన్ని సాయివర్షిత్ విచారణలో అంగీకరించినట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ వర్గాలు మీడియాకు తెలిపాయి. దీంతో అతడిని అరెస్ట్ చేశారు.

# కర్నాటకలో మరో దోపిడీ ఘటన

- **బ్యాంకులో తుపాకులతో బెదిరించి నగదు దోపిడీ**



**మంగళూరు, జనవరి17( వెలుతురు):** కర్ణాటకలోని బీదర్‌లో దోపిడీకి పాల్పడి అక్కడ ఇద్దరిపై కాల్పులు జరిపిన ఘటన మరువకముందే కర్ణాటకలో శుక్రవారం మధ్యాహ్నం మరో దోపిడీ జరిగింది. దక్షిన కన్నడ జిల్లాలోని ఉల్లాల్ కేసీ రోడ్డులో ఉన్న ఓ బ్యాంకులోకి పట్టపగలే దోపిడీ ముఠా ప్రవేశించింది. బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులను తుపాకులతో బెదిరించిన ముఠా సభ్యులు.. భారీ మొత్తంలో నగదు, బంగారం దోచుకొని పరారయ్యారు. ఫియట్ కారులో వచ్చిన ఐదుగురు దుండగులు ఈ దోపిడీకి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దోపిడీ తర్వాత దుండగులు మంగళూరు వైపు పరారైనట్లు తెలుస్తోంది.

# కార్పొరేషన్‌గా కొత్త గూడెం

**ఖమ్మం, జనవరి17( వెలుతురు):**

తెలంగాణలో కొత్త కార్పొరేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే.. రాష్ట్రంలో 13 నగరపాలక సంస్థలుండగా.. తాజాగా కొత్తగూడెంను కూడా కార్పొరేషన్‌గా ప్రమోట్ చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే.. ప్రస్తుతం మున్సిపాలిటీలుగా ఉన్న కొత్తగూడెం, పాల్వంచలతో పాటుగా 4 మండలాల్లోని 35 గ్రామ పంచాయితీలను కొత్తగా ఏర్పాటుచేయబోయే కార్పొరేషన్‌లో విలీనం చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.భారత జనగణన గణాంకాల ప్రకారం కొత్తగూడెం మున్సిపాలిటీ జనాభా మొత్తం 1,88,191 (పురుషులు 93,300, స్త్రీలు 94,891) ఉండగా.. పాల్వంచ పరిధిలోనూ లక్ష మందికిపైగా జనాభా నివసిస్తున్నారు. అయితే.. సుజాతనగర్ మండలంలోని ప్రతిపాదిత 7 పంచాయతీల పరిధిలో 11,124, చుంచుపల్లిలోని 14 పంచాయతీల పరిధిలో 41,860, లక్ష్మీదేవిపల్లి మండలంలోని 10 పంచాయతీల్లో 21,432, పాల్వంచలోని నాలుగు పంచాయతీల్లో 5,903 మంది నివసిస్తున్నారు. రెండు మున్సిపాలిటీలతోపాటు పంచాయతీలు కలిపితే మొత్తం జనాభా సుమారు 4 లక్షల వరకు చేరే అవకాశం ఉంది. కొత్తగూడెంను కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని అంశాలను పరిశీలిస్తోంది. జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెంను నగర పాలక సంస్థగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇప్పటికే పలుమార్లు సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి కోరగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త కార్పొరేషన్ ఏర్పాటు విషయాన్ని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించనున్నట్లు తెలిసింది.కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తే.. ఆ ప్రాంతానికి మహర్దశ వచ్చే అవకాశాలున్నాయని స్థానికులు



భావిస్తున్నారు. తెలంగాణకు సిరులగని అయిన సింగరేణికి కొత్తగూడెం హెడ్ క్వార్టర్స్‌గా ఉండగా.. కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రంతో పాటు స్పాంజి ఐరన్ ఇండియా లిమిటెడ్ లాంటి ప్రముఖ కంపెనీలతో పాల్వంచ ప్రాంతం ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఉన్నప్పటికీ.. ఆ ప్రాంతం గత పదేళ్లలో అనుకున్నంత అభివృద్ధికి నోచుకోకపోవటం గమనార్హంభద్రాద్రి జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన రేవంత్ రెడ్డి సర్కార్.. రాష్ట్రానికి కొత్త ఎయిర్‌పోర్టులు తీసుకొచ్చే క్రమంలో కొత్తగూడెంలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కొత్తగూడెంకు రైల్వే స్టేషన్ ఉండగా.. ఎయిర్ పోర్టు కూడా వస్తే జిల్లాకు రవాణా సౌకర్యాలు మెరుగవటమే కాకుండా.. ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ పెరిగి, మరిన్ని కంపెనీలు కూడా వచ్చే అవకాశం ఉందని భావిస్తోంది. ఫలితంగా అభివృద్ధి కూడా అంతే వేగంగా జరుగుతుందని యోచిస్తోంది. ఈ క్రమంలో.. రెండు మున్సిపాలిటీలను కలిపేసి కార్పొరేషన్‌గా ప్రమోట్ చేయటం వల్ల ఆ ప్రాంతానికి మహర్దశ పట్టనుందని స్థానిక ప్రజలు భావిస్తున్నారుమరోవైపు.. కాంగ్రెస్ పార్టీకి కంచు కోటగా మారిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత రెండు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి కేవలం ఒక్క సీటే వస్తుండటం గమనార్హం. అందులోనూ.. ఈసారి గెలిచిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ కండువా కప్పుకోవటంతో.. ఖమ్మం జిల్లా మొత్తం కాంగ్రెస్ మయంగా మారిపోయింది. దీంతో.. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారింది ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తేనే.. ఖమ్మం జిల్లాపై పట్టు కోల్పోకుండా ఉండొచ్చన్నది కాంగ్రెస్ యోచన. ఇందులో భాగంగానే.. కొత్తగూడెంలో కొత్త ఎయిర్ పోర్టు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు.. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే వలస వెళ్లిన పాల్వంచ ప్రాంతంలోని ప్రజలు తిరిగి స్వగ్రామాలకు చేరుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. కార్పొరేషన్‌లో విలీనానికి అవకాశమున్న గ్రామాలు చుంచుపల్లి మండలంలోని 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్, బాబు క్యాంప్, చుంచుపల్లి (పిటి), ధన్‌బాద్, గౌతంపూర్, ఎన్‌కే.నగర్ (బదావత్ తండా), నంద తండా, పెనుబల్లి, ప్రశాంతినగర్, రామాంజనేయ కాలనీ, రుద్రంపూర్, వెంకటేశ్వరకాలనీ, విద్యానగర్ కాలనీ లక్ష్మీదేవిపల్లి మండలంలోని అశోక్‌నగర్ కాలనీ, చాతకొండ (ఆర్), హమాలీకాలనీ, లక్ష్మీదేవిపల్లి, లోతువాగు, ప్రశాంత్ నగర్, సంజయ్ నగర్, సాతివారిగూడెం, శేషగిరినగర్, శ్రీనగర్ కాలనీ పాల్వంచ మండలంలోని బసవతారక కాలనీ, జగన్నాథపురం, కేశవపురం, లక్ష్మీదేవిపల్లి (ఎస్)సుజాతనగర్ మండలంలోని 2ఇంక్లైన్ (హెడ్ క్వార్టర్), కోమటిపల్లి, లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, నాయకులగూడెం, సుజాతనగర్.

# అన్ని పార్టీలు బల్దియాపై గురి...

**హైదరాబాద్, జనవరి17( వెలుతురు):**

హైదరాబాద్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పటి నుంచే ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది.ఎట్టి పరిస్థితుల్లో హైదరాబాద్ మేయర్ పీఠం కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ ఉవ్విళ్లూరుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలోని సీట్లన్నీ గెలుచుకున్న బీఆర్ఎస్..అదే సత్తా చూపించి ఉఊఓఅ ఎన్నికల్లో కూడా పైచేయి సాధించాలని ప్లాన్ చేస్తోంది. అర్బన్ ఏరియాల్లో పట్టున్న బీజేపీ ఈసారి బల్దియా ఎన్నికలపై పెద్ద కసరత్తే చేస్తోంది. ఇక పాత పట్నంలో బలంగా ఉన్న ఎంఐఎం మేయర్ పీఠం విషయంలో కింగ్ మేకర్‌గా ఉండేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తూనే ఉంది.అధికారంలోకి వచ్చినప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌పై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి..గ్రేటర్ హైదరాబాద్‌లో పొలిటికల్ వ్యవహారాలను తన కంట్రోల్‌లోకి తెచ్చుకునేందుకు వ్యూహాలు రచిస్తూనే ఉన్నారు. హస్తం పార్టీ హైదరాబాద్‌లో బలహీనంగా ఉండటంతో..గ్రేటర్ పరిధిలోని కొంతమంది నేతల చేరికలతో బలోపేతం చేసే ప్రయత్నం చేశారు. ఉఊఓఅ మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు ఇప్పటికే హస్తం గూటికి చేరారు.మేయర్ పీఠాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ పెట్టారు సీఎం రేవంత్. బడ్జెట్‌లో ప్రత్యేకంగా 10 వేల కోట్లు కేటాయించి..మూసీ సుందరీకరణ వంటి అంశాలతో ముందుకు వెళ్తున్నారు. మరోవైపు పొలిటికల్‌గా కూడా..ఆచితూచి వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో ఎంఐఎం సపోర్ట్ లేనిదే వర్కౌట్ అయ్యే పనికాదనే ఆలోచనతో..వారితో సఖ్యతగా ఉంటున్నారు. ఎంఐఎంతో కలుపుకొని వెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు.ఇప్పటికే పార్టీ క్యాడర్‌ను కూడా అప్రమత్తం చేసే దిశగా..పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వరుస సమీక్షలు చేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం 150 డివిజన్లకు గాను..40 డివిజన్లకుపైగా ఓల్డ్ సిటీలోనే ఉంటాయి. ఇవన్నీ కూడా ఎంఐఎంకు కంచుకోటగా ఉంటాయి. మ్యాజిక్ ఫిగర్ 75ను అందుకోవాలంటే కాస్త కష్టమయ్యే పనే. అందుకే




అవసరమైతే ఎన్నికల ఫలితాల తర్వాత ఎంఐఎంతో కలిసి అయినా సరే మేయర్ పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్ గట్టి కసరత్తు చేస్తుంది.ఇక రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ కూడా వ్యూహ ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యే స్థానాలన్నింటినీ బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో నగర ఓటర్లు కచ్చితంగా తమవైపే ఉంటారని ఆశలు పెట్టుకుంటుంది.ఒకవేళ మేయర్ పీఠం దక్కకపోయినా..కింగ్ మేకర్‌గా ఉండాలని ఆలోచనలో బీఆర్ఎస్ ఉంది. ఇక మరో ప్రధాన పార్టీ బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ పీఠంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. గత ఎన్నికల్లో చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించిన కమలం పార్టీ..ఈసారి మరింత గట్టిగా పనిచేసి..గతంలో కంటే ఎక్కువ సీట్లు సాధించాలని చూస్తోంది.ఉఊఓఅ ఎన్నికల్లో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ సీట్లు రాకపోతే..మేయర్ పీఠం విషయంలో హంగ్ తప్పనిసరి. అప్పుడు కాంగ్రెస్, ఎంఐఎం ఒకటైతే.. అనివార్యమైతే బీఆర్ఎస్, బీజేపీ చేతులు కలిపే అవకాశం లేకపోలేదనే చర్చ పొలిటికల్ సర్కిల్‌లో జరుగుతోంది. ఎన్నికల తర్వాత వచ్చే సీట్లను బట్టి పొలిటికల్ పార్టీల స్టాండ్ మారే అవకాశం ఉంది.ఇప్పటికైతే కాంగ్రెస్, ఎంఐఎం ఒకే దారిలో నడుస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎడమొహం, పెడమొహంగా ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు ఉఊఓఅ ఎన్నికల ఫలితాల తర్వాత హంగ్ వస్తే మాత్రం..మేయర్ పీఠం కోసం ఒకటి కాక తప్పదన్న చర్చ జరుగుతోంది. చూడాలి మరి మేయర్ పీఠం దక్కించుకునే విషయంలో ఏ పార్టీ అప్పర్ హ్యాండ్ సాధిస్తుందనేది.

# క్యూ ఆర్ కోడ్ లో రేషన్ కార్డులు

**కర్నూలు, జనవరి17( వెలుతురు):**

ఏపీలో త్వరలోనే నూతన రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి. నవ దంపతులకు కొత్త కార్డులు జారీ చేయనుండగా, పేర్ల మార్పు చేర్పులకు అవకాశం కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు రాజకీయ పార్టీల రంగులతో ఇచ్చిన రేషన్ కార్డులకు చరమగీతం పాడడంతో పాటు అత్యాధునిక కార్డులను అందించేందుకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ సన్నాహాలు ప్రారంభించారు.ఆరునెలల పాలనా కాలంలో క్రమంగా అధికార యంత్రాంగాన్ని గాడిన పెడుతూ వస్తున్న కూటమి ప్రభుత్వం.. క్రమంగా ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తోంది. అందులో భాగంగా పౌర సరఫరాల శాఖలోని అవినీతిపై పెద్ద ఎత్తున దాడులు చేస్తూ.. అక్రమార్కుల ఆట కట్టించింది. ఇక ఇప్పుడు.. నూతన లబ్ధిదారుల ఎంపిక, వారికి జారీ చేయనున్న కార్డుల విషయమై కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ఆగిపోగా.. అనేక మంది లబ్దిదారులకు కార్డులు జారీ కాలేదు. అలాంటి వారందరికీ ఇప్పుడు.. సరికొత్త కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.కొత్తగా పెళ్లైన దంపతులకు, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులకూ అవకాశం కల్పించనున్నారు. ఇందు కోసం.. ప్రత్యేకంగా.. ఆన్ లైన్ పోర్టల్ ప్రారంభించనున్నారు. అందుబాటులోని సాంకేతికతను వినియోగించుకుని.. ఇకపై రేషన్ కార్డుల్ని క్రెడిట్ కార్డుల తరహాలో క్యూఆర్ కోడ్ లతో జారీ చేయనున్నారు.




ఇందుకోసం ఇప్పటికే.. సన్నాహాలు కూడా పూర్తయ్యాయి. ఈ నెల చివర్లో కానీ, వచ్చే నెల ప్రారంభంలో కానీ.. రాష్ట్ర వ్యాప్తంగా కార్డుల్ని జారీ ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.కార్డులపై క్యూఆర్ కోడ్ ఉండనుండగా.. అందులో కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలు ఉండనున్నాయి. రేషన్ పంపిణీ సమయంలో ఆ కోడ్ ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలిసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపితే.. వెంటనే కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం.. అధికార యంత్రాగం, ప్రభుత్వం వివిధ పనుల్లో బిజీబిజీగా గడుపుతోంది. తీరికలేని హడావిడిలో ఉండడంతోనే.. కార్డుల ఆమోదం, జారీ ప్రక్రియ ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వం హయంలో కొత్తగా పెళ్లైన వాళ్లకు వెనువెంటనే రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించారు. కానీ.. కొన్ని నెలలకే ఆ విధానాన్ని పక్కన పెట్టేశారు. ఆరునెలలకు ఓ సారి మాత్రమే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. దాంతో.. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా మంజూరు చేయాల్సిన కొత్త కార్డులు చాలానే మిగిలిపోయాయి. ఈసారి వాటిని జారీ చేయడంతో పాటు వెనువెంటనే నూతన దంపతులకు కార్డులు మంజూరు చేసే అవకాశాన్ని కల్పించనున్నట్లు సమాచారంరాష్ట్రంలోని చాలా రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు తప్పుల తడకగా మారాయి. దాంతో.. అనేక పథకాల లబ్ధిదారులు నష్టపోతున్నారు. పేర్లు తేడాగా ఉంటున్న కారణంగా చాలా పథకాలకు అనుసంధానించేందుకు వీలు కావడం లేదు. పైగా..ఆన్ లైన్ విధానాన్ని సైతం ఆపేయడంతో.. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ఈ సమస్యలన్నింటినీ ఈ సారి నూతన కార్డుల జారీ సమయంలో పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉండగా.. 3.36 లక్షల రేషన్ కార్డు సమస్యలు పెండింగ్ లో ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. వీటిలో.. 70 వేలకు పైగా నవదంపతుల నుంచి అందిన దరఖాస్తులుగా చెబుతున్నారు. కార్డుల్లో విభజన కోసం 46 వేలకు పైగా, కొత్త సభ్యుల చేరికలకు 2 లక్షల 13 వేలు, సభ్యులను తొలగించేందుకు 36 వేలు, అడ్రస్ మార్పుల కోసం 9 వేలకు పైగా దరఖాస్తులు అందగా.. రేషన్ కార్డుల్ని సరెండర్ చేసేందుకు 685 మంది సిద్ధంగా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇలా.. అన్ని రకాలుగా చూస్తే మరో 2 లక్షల రేషన్ కార్డులు ఇవ్వాల్సి వస్తుందని అధికారుల అంచనా. దాంతో.. రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.50 కోట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.





# ఎమర్జెన్సీకి అవార్డు పక్కా

బాలీవుడ్‌లో ఉన్న సెల్ఫ్‌మేడ్ లేడీ యాక్టర్లలో టాప్‌లో ఉంటుంది కంగనారనౌత్. గ్లామరస్ పాత్రలతోపాటు పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ సినిమాలతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. చాలా కాలంగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న ఈ యాక్టర్ కమ్ పొలిటిషియన్ తాజాగా ఎమర్జెన్సీ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రాన్ని దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాలనలో 1975 జూన్ 25 నుండి 1977 వరకు కొనసాగిన ఇండియన్ ఎమర్జెన్సీ ఆధారంగా తెరకెక్కించారు. ఎమర్జెన్సీ సమయంలో పౌరహక్కుల సస్పెన్షన్, ఇందిరా గాంధీ వ్యతిరేకుల అరెస్టుతోపాటు పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిసిందే. ఎమర్జెన్సీ టైంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా నిలబడ్డ ప్రముఖ రాజకీయ వేత్త జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) పాత్రలో పాపులర్ బాలీవుడ్ దర్శకనిర్మాత అనుపమ్ ఖేర్ నటించగా.. అటల్ బిహారీ వాజ్‌పేయిగా శ్రేయాస్ తల్పడే, భూమికా చావ్లా ఇతర కీలక పాత్రలు పోషించారు. పొలిటికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కంగనారనౌత్ ఇందిరాగాంధీ పాత్రలో నటించింది. నేడు (జనవరి 17న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. ఓ వైపు లీడ్ రోల్‌లో నటిస్తూనే.. మరోవైపు డైరెక్టర్‌గా మెగాఫోన్ పట్టింది. మరి కంగన రనౌత్ ఎమర్జెన్సీ గురించి నెట్టింట టాక్ ఎలా ఉందో తెలుసుకుందాం.




# విడుదలకు ముందే క్రేజ్ పెంచేస్తున్న దర్శకులు

ఒక్కో దర్శకుడు..ఒక్కో స్టైల్‌లో వీడియోల విడుదల గత కొన్ని రోజులుగా దర్శకులు విభిన్నంగా ఆలోచిస్తున్నారు. సినిమా ప్రకటించి, క్రేజీ విజువల్స్‌తో కూడిన వీడియోలను విడుదల చేసి అలరిస్తున్నారు. తమిళ దర్శకులు లోకేశ్ కనగరాజ్, నెల్సన్ దిలీప్‌కు ఈ ట్రెండ్‌ను తారస్థాయికి తీసుకెళ్లారు. మరికొంతమంది దర్శకులు ఒకటో, రెండో కీలక షెడ్యూల్స్‌ను పూర్తి చేసి, అందులోని ఆసక్తికర సన్నివేశాలతో ప్రచార చిత్రాలను విడుదల చేస్తున్నారు. ఇటీవల కాలంలో అలా వీడియోతోనే అంచనాలను పెంచేసిన సినిమాలు అనేకం. రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'జైలర్' ఎంతటి విజయాన్ని అందుకుందో తెలిసిందే. దానికి కొనసాగింపుగా వస్తున్న చిత్రం 'జైలర్ 2' సంక్రాంతి కానుకగా విడుదల చేసిన వీడియో ప్రస్తుతం ఈ సినిమాపై అంచనాలను పెంచేసింది. తొలి చిత్రాన్ని మించి ఇందులో ఎలివేషన్స్ ఉంటాయని దర్శకుడు నెల్సన్ ఒక్క వీడియోతో చెప్పేశారు. అలాగే తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ మేకింగ్ విభిన్నంగా ఉంటుంది. రజనీకాంత్ కథానాయకుడిగా ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ కూడా విడుదలకు సిద్ధమవుతోంది. 'విక్రమ్', 'లియో'ల ప్రకటన మాదిరిగానే గతేడాది 'కూలీ' టైటిల్‌ను ప్రకటిస్తూ 'విందు ఉంది.. చిందు ఉంది.. మందు ఉంది.. సుఖం ఉంది.. అనుభవించే మనస్సు ఉందంటే, స్వర్గంలో చోటుంటుంది' అంటూ విడుదల చేసిన వీడియో విశేషంగా అలరించింది. కమల్‌హాసన్ , మణిరత్నం కాంబినేషన్‌లో సినిమా అంటే అంచనాలు భారీగా ఉంటాయి. అందుకుతగినట్లుగానే 'ది థగ్ లైఫ్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. శింబు, త్రిష, అభిరామి, నాజర్ తదితరులు కీలకపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. ఈ సినిమా ప్రకటించినప్పుడు విడుదల చేసిన వీడియో సైతం ఆకట్టుకుంది. 'ఓజీ.. ఓజీ..' ఇప్పుడు పవన్‌కల్యాణ్ ఎక్కడ కనపడినా అభిమానులు కేరింతలు ఇవి. 'మీ దుంప తెగ.. ఎప్పుడూ ఓజీయేనా' అంటూ ఆయన సైతం కొన్నిసార్లు అసహనం వ్యక్తంచేసిన సందర్భాలు ఉన్నాయి. అంత ఇంపాక్ట్ కేవలం ఒకే ఒక్క వీడియోతో క్రియేట్ చేశాడు సుజీత్. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ' సినిమా మొదలుపెట్టిన కొద్దిరోజులకే విడుదల చేసిన స్పెషల్ వీడియో ఇప్పటికీ పవన్ అభిమానులకు బూస్ట్ ఇస్తూనే ఉంది. 'వాడు నరికిన మనుషుల రక్తాన్ని ఏ తుపాను కడగలేకపోయింది' అంటూ వచ్చిన వీడియోను, అందులో పవన్ చూస్తే, ప్రతిసారీ గూస్ బంప్స్ ఖాయం. అది నిప్పు కాదు.. దర్శనం...'వెలుగు.. వెలుగులో కంటికి అంతా కనపడుతుంది. కానీ, అది నిప్పు కాదు.. దర్శనం..' అంటూ థ్రిల్ పంచేందుకు సిద్ధమవుతున్నారు రిషభ్‌శెట్టి. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడిక్ హారర్ ఫాంటసీ మూవీ 'కాంతార: చాప్టర్1' గతంలో వచ్చిన 'కాంతార:ది లెజెండ్'కు కొనసాగింపుగా ఈ మూవీని తీర్చిదిద్దుతున్నారు. షూటింగ్ మొదలైన కొద్దిరోజులకే ఫస్ట్‌లుక్ పేరుతో విడుదల చేసిన వీడియో అందరినీ అలరించడమే కాదు, ప్రీక్వెల్‌పైనా అంచనాలను పెంచింది అతనే ఒక ప్రమాదం..వైవిధ్యమైన కథలు, పాత్రలతో అలరించే కథానాయకుడు నాని. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'హిట్ 3'. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సినిమాను మొదలుపెట్టే ముందు 'హిట్: ది థర్డ్ కేస్'.. హంటర్స్ కమాండ్ పేరుతో విడుదల చేసిన వీడియో ఆకట్టుకుంది. ఇందులో నాని అర్జున్ సర్కార్‌గా పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. ఇంతకుముందు విష్వక్ సేన్‌తో 'హిట్', అడివి శేష్‌తో 'హిట్ 2' చిత్రాల్ని తెరకెక్కించిన శైలేశ్ మూడో భాగాన్ని నానితో తీయడంతో ఈ సినిమా పైనా భారీ అంచనాలు ఉన్నాయి. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న పోలీస్ యాక్షన్ డ్రామా 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ మూవీ ఒకట్రెండు షెడ్యూల్స్ పూర్తయిన తర్వాత 'భగత్స్ బ్లేజ్' పేరుతో విడుదల చేసిన వీడియో బాగా ట్రెండ్ అయింది. 'గాజు పగిలేకొద్దీ పదునెక్కుద్ది' అంటూ పవన్ పలికిన సంభాషణలు సినిమాపై అంచాలను పెంచడమే కాదు, ఏపీ ఎన్నికల్లో ఆయనకు ప్రచారాస్త్రంగానూ ఉపయోగపడింది. 'గ్లాస్ అంటే సైజు కాదు సైన్యం.. కనిపించని సైన్యం' డైలాగ్ ఎవర్‌గ్రీన్ ఇవే కాదు, గతంలో ప్రభాస్ 'సాహో', అల్లు అర్జున్ 'పుష్ప2' షూటింగ్ పూర్తిగా మొదలు పెట్టకముందే స్పెషల్ వీడియోల విడుదలతో అలరించాయి.మొత్తంగా టేకింగ్ వీడియోలతో దర్శకుల సినిమాపై క్రేజీ పెంచేస్తున్నారు.




# పుష్ప-2లో మరో 20 నిముషాలు







ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప 2 ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయికగా నటించింది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.1850 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.2000 కోట్ల దిశగా దూసుకెళుతుంది. అయితే ఈ సినిమాకి సంబంధించి రీలోడెడ్ వెర్షన్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో విడుదలకు ముందు డిలీట్ చేసిన 20 నిమిషాలను మేకర్స్ తాజాగా యాడ్ చేశారు. ముందుగా జనవరి 11న యాడ్ చేద్దామనుకున్నా అనుకోని కారణాల వలన జనవరి 17కి వాయిదా వేసింది. తాజాగా 20 నిమిషాల డిలీటెడ్ సీన్స్ థియేటర్ వెర్షన్‌లో కలిపింది. అయితే ఈ సీన్స్‌లో ఒక హైలెట్ సీన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ సీన్ ఎంటంటే.. పుష్ప పార్ట్ 1లో.. పుష్ప రాజ్(అల్లు అర్జున్) మెడలో ఉన్న లాకెట్‌ను అతడి అన్నయ్య (అజయ్) కోపంతో తీసుకోని వెళతాడు. అయితే అదే చైన్‌ను తీసుకువచ్చి పార్ట్ 2 క్లైమాక్స్‌లో పుష్పరాజ్ మెడలో వేస్తాడు అజయ్. ఈ సన్నివేశాన్ని విడుదల ముందు కట్ చేశారు మేకర్స్. మరోవైపు సుకుమార్ ఈ విషయం ఎలా మార్చిపోయాడు అంటూ విడుదల తర్వాత దీనిపై చర్చ కూడా జరిగింది. అయితే కొత్తగా యాడ్ చేసిన వాటిలో ఈ సీన్ కూడా ఉండడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు.

# మహేష్ సినిమాలో ప్రియాంకా చోప్రా

## అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రియాంకా

పాపులర్ అమెరికన్ సింగర్ నిక్ జోనస్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా హాలీవుడ్‌కు పరిమితమైపోయిందని తెలిసిందే. ఈ భామ రీఎంట్రీకి రెడీ అయినట్టు ఇప్పటికే వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. అయితే ఈ బ్యూటీ ఫైనల్‌గా ఎస్ఎస్ఎంబీ 29తో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పై మెరిసేందుకు రెడీ అవుతుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో ప్రియాంకా చోప్రా గురువారం సాయంత్రం టొరంటో నుంచి హైదరాబాద్‌లో ల్యాండైంది. దీనిక్కారణం మహేశ్ బాబు చేయబోతున్న కొత్త సినిమానేనట. ప్రియాంకా చోప్రా ఆర్‌ఆర్‌ఆర్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29 అనౌన్స్‌మెంట్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిందని నెట్టింట కథనాలు రౌండప్ చేస్తున్నాయి. ప్రియాంకా చోప్రా తప్పకుండా ఎస్ఎస్ఎంబీ 29లో భాగం కావాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని నెట్టింట ఓ అభిమాని కామెంట్ చేయగా ఆమె ఫైనల్ అయిందని భావిస్తున్నా. అయితే మాత్రం అద్భుతమైనదని చెప్పాలి.. అని మరో అభిమాని కామెంట్ చేశారు. ఇదే నిజమైతే ఐదేళ్ల తర్వాత ప్రియాంకా చోప్రా చేయబోతున్న భారతీయ సినిమా ఎస్ఎస్ఎంబీ 29 కానుంది. మరి దీనిపై కొన్ని గంటల్లో క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2002లో తొలిసారి తమిళ సినిమాతో ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చింది. ఈ బీహారీ సుందరి ఆ తర్వాత తన ఫోకస్ అంతా బాలీవుడ్‌పైనే పెట్టింది. తుఫాన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా హాయ్ చెప్పింది. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు ఇప్పటికే మేకోవర్ మార్చుకుని.. లాంగ్ హెయిర్, గడ్డం, పోనీ టెయిల్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు.



# గేమ్‌ఛేంజర్ పైరసీ దొంగ దొరికాడు

రాంచరణ్ నటించిన గేమ్ ఛేంజర్ విడుదల రోజే పైరసీ విషయంలో చిత్రయూనిట్‌కు బెదిరింపులు వచ్చాయని తెలిసిందే. పలు చోట్ల ఆన్‌లైన్‌లో సినిమా ప్రింట్ షేరింగ్స్ కూడా జరిగాయి. పైరసీ కావడంపై మూవీ టీం సైబర్ క్రైమ్ విభాగాన్ని కూడా ఆశ్రయించింది. విడుదల రోజే పైరసీ రావడంపై గేమ్ ఛేంజర్ టీం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా గేమ్ ఛేంజర్ ఏకంగా లోకల్ టీవీ ఛానెల్‌లో ప్రసారం కావడం గేమ్ ఛేంజర్ టీంను ఆందోళనకు గురి చేసింది. ఈ సినిమా వచ్చి వారం కూడా కాకుండానే లోకల్ ఛానల్‌లో ప్రసారం అయ్యింది. దీనికి సంబంధించిన స్క్రీన్ షాట్‌లను సోషల్ మీడియాలో షేర్ కూడా చేశారు నెటిజన్లు. ఏపీలోని కాకినాడ ప్రాంతంలో సినిమాను లోకల్ ఛానెల్‌లో ప్రసారం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో అప్పలరాజు అనే వ్యక్తిని గాజువాకలో అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఇప్పటికే టాలీవుడ్ నిర్మాత శ్రీనివాస కుమార్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఒక సినిమా వెనక కొన్ని వేల మంది శ్రమ దాగి ఉంటుందని తెలిపారు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఒక సినిమా విడుదలై 4 నుంచి 5 రోజులు కాకుండానే లోకల్ కేబుల్ ఛానల్‌తో పాటు బస్సుల్లో ప్రసారం చేస్తున్నారు. ఈ విషయం తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. సినిమా అంటే కేవలం దర్శకుడు, హీరో, నిర్మాతలే కాదు. ఇది నాలుగేండ్ల కృషి. ఇలా ఆన్‌లైన్ పైరసీ చేస్తున్నప్పుడు సినిమా విజయంపై ఆధారపడి జీవిస్తున్న డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల గురించి ఆలోచించండి. ఇలా చేయడం వలన చిత్ర పరిశ్రమ భవిష్యత్తుకు కూడా ముప్పు ఉంటుంది. ఈ చర్యలపై ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకునే టైం వచ్చిందంటూ ట్వీట్ చేశాడు.

# 19తో ముగియనున్న ఉత్తర ద్వార దర్శనాలు

- 21 నుంచి ఇక సర్వ దర్శనాలకు టీటీడీ ఏర్పాట్లు



**తిరుమల జనవరి17( వెలుతురు):**

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రస్తుతం వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 10 నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. దాదాపు పది రోజుల పాటు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించింది . దీంతో పెద్ద సంఖ్యలతో భక్తులు తిరుమల శ్రీవారిని వైకుంఠ ద్వారం గుండా ప్రవేశించి దర్శనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఏడురోజులుగా వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. లక్షల్లో భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు చెబుతున్నారు. మరో మూడు రోజుల పాటు ఈ దర్శనాలు కొనసాగనున్నాయి. ఈనెల 19వ తేదీతో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియనున్నాయి. వైకుంఠ ద్వార దర్శనం నేపథ్యంలో తిరుమలలో అన్ని సేవలను టీటీడీ రద్దు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా సామాన్య భక్తులకే స్వామి వారి దర్శనం కల్పించేలా ఏర్పాటు చేశారు టీటీడీ అధికారులు. కాగా.. ఈనెల19తో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియనున్న నేపథ్యంలో శ్రీవారి భక్తులకు టీటీడీ శుభవార్త చెప్పింది. శ్రీవారి సర్వదర్శనాలను 20 నుంచి పునరుద్ధరించబోతోంది. అందుకోసం ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్యచౌదరి, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొని సర్వదర్శనాలపై చర్చలు జరిపారు. నెల 19తో వైకుంఠ ద్వార దర్శనం ఎస్ఎస్డీ టోకెన్ల జారీ ముగియనుంది. ఈనెల 20న స్వామి వారి సర్వదర్శం కోసం వచ్చే భక్తులకు 19న ఎస్ఎస్డీ టోకెన్లను జారీ చేయరని.. వారు సర్వదర్శనం క్యూలైన్‌లలో నేరుగా స్వామివారిని దర్శించుకోవచ్చని టీటీడీ ఈవో వెల్లడించారు. అలాగే 19న ఆన్‌లైన్‌లో కూడా శ్రీవాణి దర్శన టికెట్లను జారీ చేయరని తెలిపారు. అలాగే 20న ప్రోటోకాల్ భక్తలకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనం కూడా రద్దు చేశామని.. ఈ నేపథ్యంలో 19న వీఐపీ బ్రేక్ దర్శనం కోసం సిఫార్సులను స్వీకరించబోమని టీటీడీ ఈవో శ్యామలారావు పేర్కొన్నారు. కాగా.. ఈనెల 21 నుంచి శ్రీవారి సర్వదర్శనం టోకెన్స్‌ని ఏ రోజుకు ఆ రోజూ జారీ చేయనున్నారు. అలాగే రద్దు చేసిన ఆర్జిత సేవలు కొనసాగుతాయి.

# బళ్లారి అధికారులపై పలు ఫిర్యాదులు

- నేడు విచారించనున్న ఉప లోకాయుక్త




**బెంగళూరు, జనవరి17( వెలుతురు):**

ప్రభుత్వ అధికారుల పనితీరుపై బళ్లారి జిల్లాలో 95 ఫిర్యాదులు నమోదు కాగా, వాటిని ఈ నెల 18వ తేదీన ఉప లోకాయుక్త అధికారి జస్టిస్ బి.వీరప్ప విచారించనున్నారు. వివిధ శాఖలకు చెందిన 255 మందిపై అధికారులు 95మంది లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. వీరందరికి జిల్లా లోకాయుక్త ఎస్పీ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న ఉప లోకాయుక్త విచారణలో నోటీసులు అందుకున్న అధికారులు, ఆయా శాఖల ప్రధాన అధికారులు విచారణకు హాజరు కావాల్సి ఉందని నోటీసులో సూచించారు. అన్ని కేసులు విచారణ జరపనున్న ఉప లోకాయుక్త అధికారి అదేరోజు ఆదేశాలు జారీ పిర్యాదులు పరిష్కరించనున్నట్లు సమాచారం. చాలా వరకు కేసులు ఇప్పటికే విచారణ జరిగాయి. ఇంకా కొన్నికేసులు విచారణ చేయాల్సి ఉంది. ఉప లోకాయుక్త అధికారి బళ్ళారి పర్యటన నేపథ్యంలో జిల్లా పాలనామండలికి చురుకు ముట్టినట్లు అయింది. లోకాయుక్త అధికారులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఎపుడు వస్తారోనని అధికారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. దీంతో రాత్రిపగలు తేడాలేకుండా ఆఫీసుల్లో ఫైళ్ళు సర్దేపనిలో నిమగ్నమయ్యారు. జిల్లాధికారి ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి కార్యాలయాల్లో ఎలాంటి దోషాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో క్రింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి కార్యాలయం ముఖ్యస్తులు విశ్రాంతి లేకుండా పనులు చేయిస్తున్నారు. గురువారం ఉపలోకాయుక్త అధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తెల్లవారు జామున బళ్ళారి ఏపీఎంసీ, జిల్లా ఆసుపత్రి, తాసీల్దారు కార్యాలయం, బళ్ళారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(బిమ్స్)లో రోగులకు అందుతున్న వైద్యసేవలు గురించి పర్యవేక్షించడం గమనార్హం. జిల్లాస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతికి సంబంధించి 30 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, ఇందులో 15ఏళ్ళ క్రితం నమోదైన కేసులు ఉన్నట్లు తెలిసింది. కొన్నికేసులకు సంబంధించి చార్జ్‌షీట్ వేసేందుకు సంబంధిత అధికారుల నుండి అనుమతి కోరినట్లు తెలిసింది. కొన్ని అభ్యర్థులు తిరస్కరించగా, కొన్ని అభ్యర్థలు మంజూరు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఒక ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో ఈ వాస్తవాలు వెలుగుచూశాయి కేసుల స్వరూపం భిన్నంగా ఉండడంతో 18న విచారణ జరగనుందని అధికారుల సమాచారం.

# సొంత క్యాడర్ నుంచి చికాకులు

**విజయవాడ, జనవరి17( వెలుతురు):**



తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ఆర్నెల్లుగా ప్రధాన ప్రతిపక్షం వైసీపీ నుంచి పెద్దగా చికాకులు ఎదురు కాలేదు. ఒకటి రెండు సందర్భాలు వచ్చినా వాటిని సులువుగానే టీడీపీ అధినేత అధిగమించగలిగారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ అధ్యక్షుడు ప్రభుత్వం మీద దూకుడుగా వెళ్లాలని ప్రయత్నించినా ఆ పార్టీ క్యాడర్ పెద్దగా స్పందించలేదు. అధికార పార్టీతో ఎందుకొచ్చిన గొడవ అనుకుని నేతలు కూడా సైలెంట్ అయిపోయారు. సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తుందని చాలా మంది అజ్ఞాతంలోకి జారుకున్నారు.వైసీపీ నుంచి సోషల్ మీడియాలో తప్ప బయట పెద్దగా ప్రతిఘటన లేకపోవడం, ఆ తర్వాత సోషల్ మీడియా దుష్ప్రచారాలను కట్టడి చేయడానికి పెద్ద ఎత్తున పోలీస్ కేసులు నమోదు కావడంతో ప్రత్యర్థుల నుంచి ఆ దూకుడు కూడా తగ్గిపోయింది. ఈ క్రమంలో హుషారుగా ఉండాల్సిన టీడీపీ అధినేతకు సొంత క్యాడర్ నుంచి చికాకులు ఎక్కువయ్యాయి. సోషల్ మీడియాలో ప్రత్యర్థుల కంటే సొంత పార్టీ నాయకులు, పార్టీ అభిమానులు, ప్రతిపక్షంలో ఉండగా టీడీపీని భుజాన మోసిన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికలపై చెలరేగిపోతున్నారు.టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుల్లో చాలామంది తాము అధికారంలో ఉన్నామనే సంగతి మరిచి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాలు, సంకీర్ణ ధర్మంలో భాగంగా తీసుకున్న విధానపరమైన అంశాలను కూడా తప్పు పడుతున్నారు. ఐదేళ్ల పాటు టీడీపీ నినాదాల్ని, వాదనల్ని సమర్థవంతంగా వినిపించిన క్యాడర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాక ముందే అసంతృప్తి గళాలను వినిపిస్తున్నారు. కొద్ది మంది వైసీపీని నిందించే క్రమంలో టీడీపీనే తప్పు పడుతున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్న సంగతి మరిచి ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.కొద్ది నెలలుగా టీడీపీ క్యాడర్‌లో ఈ తరహా అసంతృప్తి పెరిగిపోతోంది. పార్టీ అధి నాయకత్వం తమను నిర్లక్ష్యం చేస్తోందనే భావన కార్యకర్తలు, దిగువ శ్రేణి నాయకుల్లో ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన వారు బదులు తీర్చుకోవాలని తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో అలాంటి చర్యలు వద్దని ముఖ్యమంత్రి పదేపదే వారించడం వారికి రుచించడం లేదు. వైసీపీ పంథాలో సాగితే తే?డా ఏముంటుందని, రాష్ట్ర ప్రయోజనాలు అభివృద్ధిపై దృష్టి సారించాలని నచ్చచెప్పే ప్రయత్నాలు వారికి రుచించడం లేదు.ఇక టీడీపీ అనుకూల మీడియాలో సైతం ప్రభుత్వాన్ని ఇరుకున పడేసే కథనాలతో చంద్రబాబు సతమతం అవుతున్నారు. తమ వారనుకునే వారి నుంచి ఎదురవుతున్న విమర్శలు, కథనాలతో చంద్రబాబు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతం ఏపీలో బీజేపీ-జనసేనలతో కలిసి టీడీపీ ప్రభుత్వాన్ని నడుపుతోంది. విధానపరమైన నిర్ణయాలను మూడు పార్టీలు కలిసి తీసుకోవాల్సి వస్తోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, డిప్యూటీ సీఎం జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఏపీ ప్రభుత్వంలో ముఖ్య నాయకుడిగా నారా లోకేష్ వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో చాలా వరకు ఆయన భాగస్వామ్యం ఉంటోంది. చంద్రబాబు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకునే క్రమంలో లోకేష్ క్రియాశీలకంగా ఉన్నారు. ప్రభుత్వ శాఖలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ క్రమంలోనే చంద్రబాబు తర్వాత టీడీపీ పగ్గాలు ఏదొ? ఒక సమయంలో లోకేష్ అందిపుచ్చుకోవాల్సి ఉంటుందనే అంచనా అందరిలో ఉంది. అదే సమయంలో టీడీపీ తీరుపై ఆ పార్టీ క్యాడర్ చేస్తోన్నవిమర్శలు, లోపాలను ఎత్తి చూపే క్రమంలో ప్రభుత్వాన్ని నిందిస్తున్న తీరు టీడీపీకి మేలు కంటే చేటు ఎక్కువగా చేస్తున్నాయి.ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లేందుకు సోషల్ మీడియాను వాడుకోవడం మొదలైన తర్వాత అన్ని రాజకీయ పార్టీలు గత పదేళ్లుగా సోషల్ మీడియాను విస్తృతంగా వాడుతున్నాయి. సోషల్ మీడియా వినియోగంలో సీబీఎన్ ఆర్మీ పేరిట ఐటీ ప్రొఫెషనల్స్ 2014 ముందు నుంచి విస్తృతంగా పనిచేస్తున్నారు. స్వచ్ఛంధంగా చాలామంది చంద్రబాబు కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలపై కాంపెయిన్ చేస్తున్నారు.2019లో టీడీపీ ఓటమి పాలై తిరిగి పుంజుకోడానికి కూడా సోషల్ మీడియా బలంగా పనిచేసింది. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష పాత్ర నుంచి ప్రభుత్వంలో ఉన్నామనే స్పృహలోకి రావడంలో టీడీపీ అనుకూల సోషల్ మీడియా కన్‌ఫ్యూజ్ అయినట్టు కనిపిస్తోంది. ఇప్పటికీ విధానపరమైన అంశాల్లో లోపాలకు ఆర్నెల్ల క్రితం అధికారం పోగొట్టుకున్న వైసీపీని నిందించే పనిలోనే ఉన్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తప్పు పట్టడంలో వారే ముందు ఉంటున్నారు.మద్యం విక్రయాలు, ఇసుక, బ్యూరోక్రసీ, ప్రభుత్వ సేవలు, విద్యా వైద్యం వంటి అంశాల్లో సొంత పార్టీ వారి నుంచి పలు సందర్భాల్లో విమర్శలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం తమకు నచ్చని ఏ పని చేసినా విమర్శించడానికి వెనుకాడటం లేదు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అధికారుల నియామకాలు, పోస్టింగుల నుంచి ప్రమోషన్లు, బదిలీల వరకు ప్రతి అంశాన్ని తప్పు పట్టడం మొదలైంది. ప్రతి ఒక్కరు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో చంద్రబాబు నిర్ణయాలను నేరుగా విమర్శించడం సాధారణమై పోయింది. ఈ క్రమంలో వారికి తెలియకుండానే చంద్రబాబును కార్నర్ చేస్తున్నామనే సంగతి మరిచి పోతున్నారు.ఐఏఎస్ అధికారుల పోస్టింగులు, గత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన వారిని తిరిగి ప్రభుత్వంలో చేర్చుకోవడం, ఆరోపణలు ఉన్న వారికి పోస్టింగులు ఇవ్వడం, తమను వేధించిన పోలీసులకు కీలక స్థానాల్లో బాధ్యతలు అప్పగించడం వంటి నిర్ణయాలను సోషల్ మీడియా వేదికలపై తూర్పారబడుతున్నారు.గత ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఎక్కువగా బెంగుళూరులోనే గడుపుతున్నారు. తాడేపల్లి నివాసంలో అడపాదడపా సమీక్షలు చేస్తున్నారు. జనవరి చివరి నుంచి జిల్లా పర్యటనలు చేపట్టనున్నారు. టీడీపీలో జరుగుతున్న పరిణామాలు ఖచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి సంతోషం కలిగిస్తుండవచ్చు. ఆర్నెల్లలో జగన్ పెద్దగా బయటకు రాకపోయిన ప్రభుత్వం పై ఎంతో కొంత వ్యతిరేకత రావడానికి టీడీపీ వర్గీయులే ఎంతో కొంత కారకులు కావడం జగన్‌కు కలిసి వస్తుంది. ఈ క్లారిటీ టీడీపీ వర్గీయులకు రాకపోతే ముమ్ముందు సమస్య తీవ్రం కావొచ్చు.

# భవన నిర్మాణ అనుమతులు మరింత సరళం

**విజయవాడ, జనవరి17( వెలుతురు):**




ఏపీలో భవన నిర్మాణాలు,లే ఔట్ల అనుమతుల జారీలో నిబంధన లు సులభతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్ -2017, ఏపీ ల్యాండ్ డెవలప్మెంట్ రూల్స్ - 2017 లో సవరణలు చేస్తూ వేరు వేరుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా భవన, లే అవుట్ల అనుమతుల్లో మార్పులు తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా కీలక సంస్కరణలతో ఉత్తర్వులు జారీ చేశామని, సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనలు మార్పులు జీవోలు జారీ చేసినట్టు చెప్పారు.లే అవుట్లలో వేసే రోడ్లకు గతంలో ఉన్న12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదిస్తూ సవరణ చేశారు. 500 చ.మీ. పైబడిన స్థలాల్లో చేపట్టే నిర్మాణాల్లో సెల్లారుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ ల ప్రమేయాన్ని తొలగిస్తున్నట్టు ప్రకటించారు.రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల మేరకు సర్వీస్ రోడ్డు విడిచిపెట్టాలనే నిబంధన తొలగిస్తున్నట్టు ప్రకటించారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేశారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సరళతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా చేసేందుకు సంస్కరణలు చేపట్టి.. ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో లే అవుట్లలో రోడ్లకు గతంలో 12 మీటర్లు ఉండగా.. ఇప్పుడు దానిని 9 మీటర్లకు తగ్గించారు. అలాగే 500 చదరపు మీటర్లు పైన స్థలాల్లో నిర్మాణాన్ని సెల్లారుకు అనుమతించారు. నేషనల్ హైవే, స్టేట్ హైవేలను ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల సర్వీస్ రోడ్డు ఏర్పాటు నిబంధనను కూడా తొలగించారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేసింది ప్రభుత్వం. టీడీఆర్ బాండ్ల జారీ చేసే కమిటీ నుంచి రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్‌లను తొలగించారు.ప్రజలకు, బిల్డర్లు, డెవలపర్లకు అనుకూలంగా ఉండేలా నిబంధనల్లో మార్పులు చేస్తూ వేర్వేరు జీవోలు జారీ చేసినట్లు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నిబంధనల్ని సులభతరం చేశామని.. అందరితో చర్చించి ఈ నిబంధనలు జారీ చేశామన్నారు. సంక్రాంతి కానుకగా ఈ జీవోలను తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు, బిల్డర్లు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు మంత్రి నారాయణ. కూటమి ప్రభుత్వం ఆ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అపార్ట్‌మెంట్లు, లే అవుట్‌లలో కొనుగోలుకు సంబంధించి వినియోగదారులు మోసపోకుండా రెరా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు మంత్రి నారాయణరియల్ ఎస్టేట్ అసోసియేషన్ ల ప్రతినిధులతో చర్చించి తుది నిబంధనలు జారీ చేసినట్లు మంత్రి నారాయణ వివరించారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని గత ఐదేళ్లలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని దానిని తిరిగి గాడిన పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. భవన నిర్మాణాలు, లే అవుట్లు అనుమతులను సులభతరం చేస్తూ జీవో లు జారీ చేసినట్టు వివరించారు.రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, భవన నిర్మాణాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నట్టు తెలిపారు. మార్చి నాటికి సింగల్ విండో విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. ప్రతి ఏటా రెండు సార్లు రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ల ప్రతినిధులతో సమావేశం అవుతానని మంత్రి నారాయణ చెప్పారు. నిర్మాణ రంగానికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## విద్యారంగంలో కీలక మార్పులు

**గుంటూరు, జనవరి17( వెలుతురు):**

పాఠశాల విద్యా సంస్కరణలు అమలు చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 117ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. అయితే జీవో 117ను రద్దు చేసినప్పటికీ ఇంచుమించు అదే విధానాలతో మళ్లీ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులను విడుదల చేశారు. గత జీవో నెంబర్ 117లో కంటే కొన్ని మార్పులు చేశారు.గతంలో ఉన్న ఆరు రకాల పాఠశాలలకు బదులు ఐదు రకాల పాఠశాలల విధానాన్ని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. గతంలో ప్రవేశపెట్టిన శాటిలైట్ ఫౌండేషనల్ స్కూళ్ల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించింది. ఫౌండేషనల్ స్కూళ్లను అలానే కొనసాగించింది. అయితే ఫౌండేషనల్ స్కూల్ ప్లస్ పేరును బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మర్చింది.ప్రీ హైస్కూల్ విధానాన్ని రద్దు చేసి మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ముందుకు తీసుకొచ్చింది. 3, 4, 5 తరగతుల విలీనాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే హై స్కూల్ ప్లస్ విధానాన్ని ఏం చేస్తారో అనేది స్పష్టం ఇవ్వలేదు. ఫౌండేషనల్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు 1:20 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్న విద్యా వేత్తల డిమాండ్‌ను పట్టించుకోలేదు. గత ప్రభుత్వం వలే ఇప్పుడు కూడా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని నిర్ణయించింది. పెరగనున్న ఏకోపాధ్యాయ పాఠశాలలు?: ఫౌండేషనల్ స్కూల్‌లో 1:30 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించింది. విద్యార్థులు సంఖ్య 30 దాటితే మరో ఎస్‌జీటీని కేటాయిస్తామని పేర్కొంది. బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో 1:20 నిష్పత్తి ప్రకారం అమలుచేస్తామని 60 దాటితేనే మరోపోస్టు ఉంటుందని తెలిపింది. దీనివల్ల ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 60 కంటే తక్కు ఉంటే ఐదు తరగతులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురిని కేటాయిస్తారు.ఎన్‌రోల్‌మెంట్ 120 కంటే ఎక్కువ ఉంటే ప్రధానోపాధ్యాయ పోస్టు ఉంటుంది. 150 దాటితే ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్‌జీటీ ఉంటారు. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య 45-60 మధ్య ఉన్నా మోడల్ ప్రైమరీ స్కూల్ ఉంటుంది. అయితే సామాజిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల ఆధారంగా పాఠశాల యాజమాన్య కమిటీ మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటును ప్రతిపాదించే అవకాశం ఉంటుంది. అయితే దీంతో మళ్లీ పాత పద్దతికే పాఠశాల విద్య వస్తుంది. ప్రైవేట్ పాఠశాలల్లో చేరికలు పెరుగటంతో పాటు?. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్‌అవుట్ రేటు పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.విద్యార్థులు సంఖ్య 30 కంటే తక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్, బేసిక్ ప్రైమరీగా మార్చుతారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులను దగ్గరలో ఉన్న పాఠశాలలకు తరలిస్తారు. 6, 7, 8 తరగతులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 కంటే ఎక్కువగా ఉంటే, దానిని హైస్కూల్‌గా మార్చుతారు.హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 76 కంటే ఎక్కువగా ఉంటేనే ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ పోస్టులు ఉంటాయి. విద్యార్థుల సంఖ్య 400 దాటితే ఆయా స్కూల్స్‌కు రెండో పీఈటీని కేటాయిస్తారు. విద్యార్థుల సంఖ్య 751 ఉంటే మూడో పీఈటీ పోస్టు ఉంటుంది. పోస్టులు, విద్యార్థుల సంఖ్య ఆధారంగా మ్యూజిక్, ఆర్ట్, డ్రాయింగ్, క్రాఫ్ట్ పోస్టులు ఉంటాయి.గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులలో మోడల్ ప్రైమరీ స్కూల్ గుర్తించేందుకు కమిటీలు ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో ఉండే కమిటీలో కన్వీనర్‌గా ఎంఈవో-1, కో కన్వీనర్‌గా ఎంఈవో-2 ఉంటారు. సభ్యులుగా ఐసీడీఎస్ సీడీపీవో, ఎంఆర్‌వోతో పాటు ఎంపీడీవోగానీ మున్సిపల్ కమిషనర్‌గానీ సభ్యులుగా ఉంటారు. క్లస్టర్ స్థాయి కమిటీల్లో కన్వీనర్‌గా క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, సభ్యులుగా ఎంఈవో 1, 2, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఉంటారు. ఈ రెండు కమిటీలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలల ఏర్పాటు గురించి చర్చిస్తారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com